Follow: @ANNTELUGU

26-05-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 148 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

గెలిస్తే..

## డబుల్ ధమాకా

### నేటి నుండి ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్‌లు



**మహా :** ఐపీఎల్ 2026 మరో కీలక దశకు చేరుకుంది. మంగళవారం నుంచి ప్లేఆఫ్స్ ప్రారంభం కానున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ టీమ్‌లు ప్లేఆఫ్స్‌కు చేరుకున్నాయి. పాయింట్ల పట్టిక ఆధారంగా చూస్తే.. ఆర్సీబీ, గుజరాత్ జట్లు నెట్ రన్‌రేట్ పరంగా బలంగా కనిపిస్తున్నాయి. అయినా మిగతా రెండు జట్లనూ అంత తేలిగ్గా తీసుకోవడానికి లేదు.ఐపీఎల్‌లో ఇప్పటివరకు జరిగిన పోరు వేరు.. ఇకపై ప్లేఆఫ్స్‌లో జరగాల్సిన మిగితా 3వ పేజీలో

టాప్ న్యూస్

### పెట్రో వాత

నాలుగురోజుల్లో లీటర్ కు రూ.7.34పెంపు
ఇంకా పెరిగే అవకాశం




03

### ఎండల మోత

154 మంది మృతి..తెలంగాణలో పిట్టల్లా
రాలుతున్న వడ బాధితులు



03

### కూటమి రాత

జూన్ లో భేటీ
ఉంటుందన్న మమత



03



మా ప్రభుత్వం

## మహిళల ఆశీర్వాదమే

### దేశానికి ఆదర్శంగా తెలంగాణ మహిళలు

- ఇందిరా స్త్రీశక్తి భవనాల శంఖుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి
- ఒకేసారి 8వేల ఇందిరామహిళా శక్తి భవనాల నిర్మాణానికి శ్రీకారం
- మహిళలకు రైస్ మిల్లులు.. సూపర్ బజార్లు ఇస్తాం
- చిలకపచ్చ రంగులో ఇందిరమ్మచీరెల డిజైన్ల ఆవిష్కరణ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ మహిళల ఆశీర్వాదంతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది.. మహిళా సంక్షేమమే లక్ష్యంగా తమప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ఆర్థికంగా నిలబడుతుందని అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో 8 వేల ఇందిరా స్త్రీశక్తి భవనాలకు వర్చువల్ గా సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లలో మహిళా సంఘాలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు.

మహిళా సంఘాలకు ఇప్పటి వరకు రూ.60 వేల కోట్లకు పైగా రుణాలు అందించామని, వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా లాజిస్టిక్ గోడౌన్లు నిర్మించి ఇస్తామని, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో సంఘాల ఆధ్వర్యంలోనే సూపర్ బజార్ లు ఏర్పాటు చేస్తామని మిగితా 2వ పేజీలో

మైల్ స్టోన్ రియల్టర్ల


## అరాచకం

### చెరువు అలుగు, నాలాల ఆక్రమణ

- లంచాలు మెక్కి ఎన్వోసీల జారీ
- అనుమతులివ్వాలంటే గతంలో లోకల్ బాడీలకు సంబంధం ఉండేది
- నేడు విచ్చలవిడిగా అనుమతులిస్తున్న హెచ్ఎండీఏ
- విజిలెన్స్, ఎన్ పోర్స్ మెంట్ జాడ ఎక్కడ?
- అవినీతి తిమింగలాలపై చర్యలుండేనా?
- అనుమతులు రద్దు చేయకుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తాం:సామాజిక వేత్తలు

02









### బాబు జైలుకెళ్లినపుడే సీఎం అయ్యేవాడిని కదా?

03

- జగన్ జైలు నేనెందుకు కోరుకుంటా
- ప్రత్యర్థుల విమర్శలపై జనసేనాని పవన్ ఆగ్రహం

రూ.50వేలు లంచం తీసుకుంటూ

### ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్

02





### మేకల వ్యాపారులకు బక్రీద్ బంపరాఫర్

- కోట్లకు పలుకుతున్న మేకలు
- రూ.31 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు ధరలు
- వైరల్ అవుతున్న అరుదైన జాతుల మేకలు

02

### తమిళనాట విజయ్ గేమ్

- ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామా
- ఆమోదించిన స్పీకర్

02



### కుక్కల దాడిలో మహిళ మృతి

02





లక్షీదేవిపల్లి మండలం చాతకొండ
గ్రామ పంచాయతీ విషాదం

### హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట

- ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చిన ఐఆర్ఎఫ్ సీ
- రూ.13,600 కోట్లు రీఫైనాన్స్ కోసం ఒప్పందం
- మెట్రో యాజమాన్యం 100 శాతం వాటా బదిలీ
- భవిష్యత్తులో మెట్రో విస్తరణకు అవకాశం

02



02




# మైల్ స్టోన్ రియల్టర్ల అరాచకం

పెద్ద చెరువు అలుగు, నాలాలను ఆక్రమించి మైల్ స్టోన్ అనే రియల్ ఎస్టేట్ కంపెని మేడ్చల్ సర్కిల్ అత్వెల్లి లో ఆరాచకాన్ని సృష్టిస్తోంది.. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పెద్ద మొత్తంలో లంచాలు బొక్కి ఎన్వోసీలు జారీ చేసి ఇరిగేషన్ చట్టాలను తుంగలో తొక్కేసారు.. లే అవుట్ కు అనుమతులు జారీ చేయాలంటే గతంలో లోకల్ బాడీలతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి హెచ్ ఎం డీ ఏ అనుమతులిచ్చేది.. ప్రస్తుతం లోకల్ బాడీలతో సంబంధం లేకుండా అందిన కాడికి దండుకొని అనుమతులు ఇచ్చేస్తున్నారు..నిర్మాణానికైనా, లే అవుట్ కైనా హెచ్ ఎం డీ ఏ నుండి అనుమతులు జారీ చేయాలంటే దరఖాస్తు అందిన వెంటనే 14 మంది తో కూడిన లీగల్ టీమ్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి అన్ని లీగల్ గా ఉంటే అనుమతులకు సిఫార్సు చేస్తారు.. కాని అటువంటిది ఏమి లేకుండానే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులిచ్చిన ఎన్వోసి ల ఆధారంగానే ఏ సీ గదుల్లో కూర్చొని అనుమతులిచ్చేస్తున్నారు.. అక్రమాలను అడ్డుకోవాల్సిన విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ అధికార్లు పత్తాలేకుండా పోయారని, అడ్డదారిలో జారీ చేసిన అనుమతులు రద్దు చేయాలని లేకుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామంటూ సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారు.













మహా
అత్వెల్లి లో మైల్ స్టోన్ బరితెగింపు
అక్రమార్కుల చెరలో చిక్కిన పెద్ద చెరువు నాలాలు, అలుగు
• కల్వర్ట్ ల మధ్య వెంచర్ కమాన్ నిర్మాణం
• నోట్ల కట్టలతో నోళ్లు మూయించిన రియల్టర్లు
• కోట్లు మింగి లేఅవుట్ కు అనుమతులు జారీ చేసిన హెచ్ ఎండీఏ
• రెవెన్యూ, ఇరిగేషన్ జాయింట్ సర్వే రిపోర్ట్ లో ఎన్నో అనుమానాలు...
• మైల్ స్టోన్ లే అవుట్ లో ప్లాట్లు కొంటే పాట్లేనా ?

**హైదరాబాద్ మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేడ్చల్ సర్కిల్ అత్వెల్లి గ్రామానికి చెందిన పెద్ద చెరువు రియల్ మాఫీయా కబంధ హస్తాల్లో చిక్కి శల్యమైందిని బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువులు, నాలాలు, కుంటలు, అలుగులను కంటికి రెప్పలా కాపాడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ధన దాహనికి 165 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువు అలుగు, నాలాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైల్ స్టోన్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ విసిరిన కాసులకు కక్కుర్తి పడి విచ్చలవిడిగా ఎన్వోసీలు ఇవ్వటంతో హెచ్ ఎం డీ ఏ నుండి లే అవుట్ అనుమతులు పొందినట్లు వారు పేర్కొంటున్నారు.14మందితో ఏర్పాటైన లీగల్ టీమ్ కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తు అందిన వెంటనే టీమ్ క్షేత్ర స్థాయిలో సైట్ ను పరిశీలించిన అనంతరం హైరేజ్ నిర్మాణానికైనా, లే అవుట్ కైనా పర్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుంది. కాని రియల్ మాఫియా తో అంట కాగుతున్న సంబంధిత అధికార యంత్రాంగానికి భారీ ఎత్తున మూటలు ముట్టజెప్పటంతో ఏ సీ గదుల్లో కూర్చొని అనుమతులు జారీ చేయటం వారి అవినీతి అక్రమాలకు అద్దం పడుతోంద స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్. ఎం డీ ఏ లలో అవినీతి అనకొండలు తిష్ట వేసి ఉన్నప్పటికి తిమింగలాలను వదిలిపెట్టి ఏ సీ బీ అధికారులు పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాలు ప్రయోగిస్తున్నారనే అపవాదు మూటగట్టు కుంటున్నారు. అవినీతి, అక్రమాలను అరికట్టాలిసిన నిఘా వ్యవస్థలు నిద్రపోవటంతోనే అవినీతి అధికారులు పెట్రేగిపోతున్నారని బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి..లే అవుట్ అనుమతులు రద్దు చేయాలి :ఇరిగేషన్ అధికారులు జారీ చేసిన ఎన్వోసిల ఆధారంగా చేసుకొని మైల్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ కి హెచ్ ఎం డీ ఏ జారీ చేసిన లే అవుట్ అనుమతులు రద్దు చేయాలని సామాజిక వేత్తలు వెంకటేష్, సదానందు, ఆంజనేయులు డిమాండ్ చేసారు. మేడ్చల్ సర్కిల్ అత్వెల్లి గ్రామంలో వందల ఏళ్లనాటి సహజ సిద్ధంగా ఏర్పడ్డ చెరువు దాని అలుగు, నాలాలను గతంలో పనిచేసిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ధన దాహానికి అన్యాక్రాంతమై య్యాని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అడ్డదారుల్లో జారీ అయినా ఎన్వోసి లను పరిశీలించి వాస్తవాలు బట్ట బయలు చేయాలని వారు కోరుతున్నారు. ఇంటి దొంగలన్ని కాపాడే ప్రయత్నం చేస్తే న్యాయ స్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు.

**మహా కథనానికి స్పందించిన ఇరిగేషన్ డీ ఈ ఈ జైపాల్ :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన "అత్వెల్లి లో మైల్ స్టోన్ బరితెగింపు " అనే వార్తను మహా పత్రిక సోమవారం ప్రధాన శీర్షికగా ప్రచురించింది.వార్త కథనానికి ఇరిగేషన్ డీ ఈ ఈ జైపాల్ స్పందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పని చేసిన ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఎన్వోసి లను తెప్పించుకొని పరిశీలిస్తామన్నారు.ఇప్పటికే అలుగు, నాలాల పరిస్థితి చూసామన్నారు.అలాగే మరొక సారి సైట్ విజిట్ చేసి అవకతవకలు జరిగినట్లు ఉంటే ఉన్నతాధికార్లకు రిపోర్ట్ రాస్తామన్నారు.. వారి ఆదేశాల మేరకు ఎన్వోసీలు రద్దుచేస్తామన్నారు.

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో రైల్ సర్వీసును పూర్తిగా స్వాధీనం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా బలోపేతం చేసేలా కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ( ఐఆర్ఎఫ్ సీ ) మొత్తం రూ.13,600 కోట్ల రుణాలను రీ ఫైనాన్స్ చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ మనోజ్ కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే .రామకృష్ణారావు సమక్షంలో ఒప్పంద పత్రాలపై సోమవారం అధికారులు సంతకాలు చేశారు. ఈ రుణాన్ని 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక పద్ధతిలో చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ, హైదరాబాద్ మెట్రోలోని 100 శాతం వాటా ప్రభుత్వానికి బదిలీ అయిందని చెప్పారు. ''నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.. దేశ ఆర్థికాభివృద్ధికి హైదరాబాద్ నగరం కీలక చోదకశక్తిగా ఎదుగుతోంది.. మెట్రో అనుసంధానం బలోపేతం వల్ల ట్రాఫిక్ తగ్గి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయి'' అని తెలిపారు. ఈ సందర్భంగా రుణాన్ని రీఫైనాన్స్ చేసినందుకు సహకరించిన కేంద్రం, ఐఆర్ఎఫ్ సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో సంస్థ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 1, మూడు కారిడార్లలో 57 స్టేషన్లతో 69.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పబ్లిక్ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) కింద అభివృద్ధి చేసిన ప్రపంచంలోని అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్టుల లో ఇది ఒకటి. ఈ నెట్ వర్క్ ప్రస్తుతం ప్రతిరోజూ ఐదు లక్షలకు పైగా ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చుతోంది. ఈ రీఫైనాన్సింగ్, మెట్రో నెట్ వర్క్‌ను కొత్త కారిడార్లలోకి విస్తరించడానికి, హైదరాబాద్ మహానగర అంతటా లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికలకు కూడా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. ఈ ఫైనాన్సింగ్‌లో ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజులు, కమిట్‌మెంట్ ఛార్జీలు లేదా ముందస్తు చెల్లింపు జరిమానాలు లేవని ఐఆర్ఎఫ్‌సి స్పష్టం చేసింది. ఐఆర్ఎఫ్‌సికి చెల్లించాల్సిన బకాయిలను తీర్చడానికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన బేషరతు హామీ, రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ, ఆర్బీఐ మద్దతు కలిగి డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు ఉన్నాయి.

## మా ప్రభుత్వం మహిళల ఆశీర్వాదమే

(మొదటి పేజీ తరువాయి )

సీఎం ప్రకటించారు. ఇందుకోసం పట్టణ ప్రాంతాల్లో అవసరమైన ప్రభుత్వ భూములను నామమాత్రపు అద్దెలతో లీజుకు ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. నాణ్యమైన వస్తువు కొనాలంటే మహిళా శక్తి సంఘాల వద్దే కొనాలనుకునేలా బ్రాండ్ వాల్యూ పెంచుకోవాలని సూచించారు. బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించే బాధ్యత నేను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. బ్యాంక్ లోన్ల చెల్లింపులో నిర్మల్ జిల్లా మహిళా సంఘాలు తొలి స్థానంలో ఉన్నాయని చెప్పారు. ప్రజాపాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టే దిశగా ఇది చారిత్రక కార్యక్రమమని సీఎం అన్నారు. అదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను కూడా సీఎం ఆవిష్కరించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎంఎల్ ఏలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మహాలక్ష్మిపై కుట్రలు

ప్రభుత్వం వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించామని, అయితే ఈ ఉచిత ప్రయాణాన్ని అడ్డుకోవాలని విపక్షాలు ఎన్నో కుట్రలు చేశాయని సీఎం మండిపడ్డారు. ఆర్టీసీలో కేవలం ఉచిత ప్రయాణమే కాదు.. భవిష్యత్తులో మహిళలనే బస్సులకు యజమానులను చేయబోతున్నామని ప్రకటించారు. అంతేకాదు.. దేశంలో అంబానీలు, అదానీలు చేసే పెద్ద పెద్ద వ్యాపారాలను.. ఈ రోజు మన రాష్ట్ర మహిళలు చేసి చూపిస్తున్నారంటూ మహిళా సంఘాల ప్రతిభను కొనియాడారు. మహిళల ఆధ్వర్యంలో విద్యుత్ ఉత్పత్తికి కృషి చేస్తున్నామని.. ఇప్పటికే పెట్రోల్ బంకులను కూడా మహిళా సంఘాలే విజయవంతంగా నిర్వహిస్తున్నాయని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఆటో డ్రైవర్లను, కార్మికులను రెచ్చగొట్టి మహిళలకు ఉచిత బస్సు పథకానికి అడ్డుపడే ప్రయత్నం చేశారని, కొంత మందికి మహిళల ఉచిత బస్సు ప్రయాణం నచ్చలేదని విమర్శించారు. 29 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు రూ. 10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించామని, మహిళలను బస్సులకు యజమానులు చేశామన్నారు. అంబానీ, అదానీ చేసే పెట్రోల్ వ్యాపారం మహిళలు కూడా చేయాలనే బంక్ లు పెట్టించామన్నారు. దళారులు, వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని ఇకపై మహిళల సంఘాల వద్దే వడ్లను భద్రపరుస్తామన్నారు. రైస్ మిల్లులు, గౌడౌన్లు పెట్టుకోవాలని ఇందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు. మహిళా సంఘాలు సూపర్ బజార్లు పెట్టుకోవాలని సూచించారు.



## రూ.50వేలు లంచం తీసుకుంటూ

### ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్

**వరంగల్, మహా :** హన్మకొండ జిల్లాకు చెందిన ఓ అవినీతి చేప ఏసీబీ వలకు చిక్కింది. ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ పాలకుర్తి ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్ రెడ్ హ్యాండెడ్ గా చిక్కాడు. బిల్లుల జారీ కోసం లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హన్మకొండ జిల్లా పాలకుర్తి డిఈ శ్రీకాంత్ లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. హన్మకొండ భవానీనగర్ లో ఆయన నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. బిల్లులకోసం పెద్దవంగర మండలం కన్నాయిగూడెంకు చెందిన కాంట్రాక్టర్ కర్ర అశోక్ రెడ్డి ని రూ.50వేలు డిమాండ్ చేయడంతో ఏసీబీకి సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగి ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు

## తమిళనాట విజయ్ గేమ్

**చెన్నై, మహా :** కొత్త ప్రభుత్వం కొలువు దీరిన కొద్ది రోజులకే తమిళనాడులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండు వారాల క్రితమే ఎమ్మెల్యేలు ప్రమాణం చేయగా.. వారిలో ముగ్గురు నేడు (సోమవారం) రాజీనామా చేశారు. పెరుందురై ఎమ్మెల్యే ఎస్.జయకుమార్, మధురాంతకం (ఎస్సీ రిజర్వ్‌డ్) ఎమ్మెల్యే మరగతం కుమారవేల్, ధరపురం (ఎస్సీ రిజర్వ్‌డ్) ఎమ్మెల్యే పి.సత్యభామ తమ పదవులకు రాజీనామా చేశారు. అన్నాడీఎంకేకు చెందిన ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు సోమవారం తమిళనాడు స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు తమ రాజీనామా లేఖలను సమర్పించగా.. స్పీకర్ వెంటనే ఆమోదం తెలిపారు. టీవీకే చీఫ్ కోఆర్డినేటర్, మంత్రి కేఏ సెంగొట్టాయన్ ఇచ్చిన మాట ప్రకారం ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. మీరు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే రానున్న ఉపఎన్నికల్లో మళ్లీ మిమ్మల్నే బరిలోకి దింపుతామని టీవీకే నుంచి వారికి హామీ వచ్చిందని సమాచారం. ధరపురం, పెరుందురై నియోజకవర్గాలు.. అన్నాడీఎంకేకు కంచుకోట లాంటి పశ్చిమ తమిళనాడులోని కొంగు ప్రాంతంలో ఉంటాయి. మధురాంతకం నియోజకవర్గం చెన్నై నగరానికి చేరువగా ఉంటుంది. తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాత ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు టీవీకే కీలక నేత, మంత్రి ఆధవ్ అర్జునను ఆయన చాంబర్లో కలిశారు. కీలక నిర్ణయాలు తీసుకోవడానికి విజయ్ మిత్ర పక్షాలపై అతిగా ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి.. వారిని టీవీకే తరపున పోటీ చేయించి గెలిపించుకొని.. అసెంబ్లీలో సొంతంగానే పూర్తి బలాన్ని పొందాలనేది విజయ్ వ్యూహంగా కనిపిస్తోంది

## మేకల వ్యాపారులకు బక్రీద్ బంపరాఫర్



**హైదరాబాద్, మహా :** బక్రీద్ సమీపిస్తుండటంతో దేశవ్యాప్తంగా మేకల మార్కెట్‌లో అసాధారణ రీతిలో ధరలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అరుదైన జాతులకు చెందిన ప్రీమియం మేకలు కోట్ల రూపాయల వరకు అమ్ముడవుతున్నాయనే వార్తలు ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికలపై వైరల్ అవుతున్న వీడియోల్లో కొన్ని మేకలను రూ.31 లక్షల నుంచి ఏకంగా రూ.4 కోట్ల వరకు విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో సాధారణ ప్రజలే కాదు, వ్యాపారులు, పశుసంవర్ధక రంగానికి చెందినవారు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక జాతుల మేకలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల్లో పెంచుతున్న "జమునాపారి", "సిరోహి", "బీటల్", "టోటాపరి" వంటి అరుదైన జాతుల మేకలకు అధిక ధరలు పలుకుతున్నాయి. వీటి శరీర నిర్మాణం, పొడవైన కొమ్ములు, ప్రత్యేకమైన రంగులు, అరుదైన మచ్చలు, బలమైన ఆకృతి వంటి లక్షణాల ఆధారంగా వ్యాపారులు భారీ ధరలు నిర్ణయిస్తున్నారు.కొన్ని మేకల శరీరంపై సహజసిద్ధంగా ఏర్పడిన అరబిక్ అక్షరాల మాదిరి గుర్తులు, చంద్రుడు లేదా నక్షత్రాల ఆకారంలో కనిపించే మచ్చలను "దైవ సూచనలు"గా ప్రచారం చేస్తూ వాటి విలువను మరింత పెంచుతున్నారు. ఈ కారణంగా ధనిక వర్గాలు, విదేశీ కొనుగోలుదారులు, మతపరమైన విశ్వాసాలు కలిగిన వ్యక్తులు ఇలాంటి మేకలను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ప్రత్యేక మేకల ఎగ్జిబిషన్‌లు, ఆన్‌లైన్ వేలం కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ప్రభావంతో అరుదైన మేకల వీడియోలు వైరల్ అవుతుండటంతో వాటికి మరింత ప్రచారం లభిస్తోంది. కొందరు యజమానులు తమ మేకలకు ప్రత్యేక ఆహారం, ఎయిర్ కండిషన్డ్ షెడ్లు, వైద్య సంరక్షణ కల్పిస్తూ వాటిని "స్టార్ మేకలు"గా ప్రచారం చేస్తున్నారు. అయితే పశుసంవర్ధక నిపుణులు మాత్రం ఈ ధరల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి సమాచారం నిజం కాకపోవచ్చని, కొన్ని సందర్భాల్లో కేవలం ప్రచారం కోసం అధిక ధరలు చెబుతున్న అవకాశమూ ఉందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ బక్రీద్ పండుగ సమీపిస్తుండటంతో దేశవ్యాప్తంగా మేకల మార్కెట్ కళకళలాడుతుండగా, ఈసారి అరుదైన జాతుల మేకలే ప్రధాన ఆకర్షణగా మారాయి.

## గాలి వాన బీభత్సం

**తక్షణమే స్పందించిన సర్పంచ్ అశోక రాణి.**

**నెలకొండపల్లి, మే 25 మహా :** మండల కేంద్రంలోని సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుండి అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరి బిక్కిరైనా ప్రజలు ఒక్కసారిగా మారిన వాతావరణ మార్పులతో ఉలిక్కి పడ్డారు. ఒక్క సారిగా విరుచుకుపడ్డ బలమైన గాలుల దాటికి మంగాపురం వెళ్లే రహదారిలో చెట్లు విద్యుత్ స్తంభాలు రహదారి ప్రక్కన ఉన్న వృక్షాలు . దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వివిధ శాఖల అధికారులు స్థానికుల సహకారంతో రోడ్డుపై అడ్డుగాపడ్డ చెట్లను తొలగించే పనులు చేపట్టారు. జెసిపి సహకారంతో సర్పంచ్, అశోక రాణి, రోడ్లపై వృక్షాలను స్తంభాలను తొలగించారు. పలువురి ఇంటి పై కప్పు కూలిన వారిని పరామర్శించారు. వారికి జరిగిన నష్టాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు.

## కుక్కల దాడిలో మహిళ మృతి



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:కుక్కల దాడిలో మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న రాములమ్మ(40) పై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన మహిళను కొంతమంది స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మృతి చెందిన మహిళ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా కొన్ని పంచాయతీలలో వీధి కుక్కలు సంచరించడం వల్ల వాటితో ప్రమాదం పొంచి ఉందని గతంలో ఇటీవల కాలంలో అనేకమంది పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వీధి కుక్కలను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కుక్కల దాడిలో మహిళా మృతి చెందిన సంఘటనైన దృష్టిలో పెట్టుకొని కుక్కలను నివారించే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గంగాదేవిగుట్టను కాపాడండి

తహసీల్దార్ కు గుట్టకిందిగుంపు వాసుల వినతి

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం, గుట్టకిందగుంపు గ్రామపంచాయతీ పరిధిలోని గంగాదేవిగుట్టను గోదాం నిర్మాణం పేరుతో ధ్వంసం చేస్తున్నారని గుట్టను కాపాడాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎస్సై బైరు గోపి లకు వినతిపత్రం అందజేశారు. గంగాదేవిగుట్ట పై గోదాం నిర్మాణం పేరుతో గుత్తేదారు విచ్చలవిడిగా అక్రమంగా మట్టి త్రవ్వకాలు చేపట్టి విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్థులు మట్టి త్రవ్వకాలను అడ్డుకుంటున్నప్పటికి, మళ్లీ మళ్లీ త్రవ్వకాలు కొనసాగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గంగాదేవిగుట్ట వద్ద తమ ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా ఉన్న కాళికాదేవి విగ్రహం, సమ్మక్క గద్దెలు, గంగాదేవి విగ్రహాలకు ఉన్నాయని వాటికి ఆధారమైన మట్టిని తొలగించడం వల్ల అవి కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజనులమైన తమ మనోభావాలను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని వారు హెచ్చరించారు.అధికారులు వెంటనే జోక్యం చేసుకొని అక్రమ మట్టి త్రవ్వకాలను నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గుట్టపై త్రవ్వకాలు ఆపకపోతే అఖిలపక్షాల సాయంబతో పోరాటాన్ని ఉదృతం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.

# గెలిస్తే..డబుల్ ధమాకా

(మొదటి పేజీ తరువాయి )
పోరు వేరు. ఇకపై గెలిస్తేనే నిలిచేది. మూడు, నాలుగు స్థానాల్లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్‌కు ప్రతి మ్యాచూ నాకౌటే. నెగ్గితేనే ఐపీఎల్ టైటిల్ వేటలో ముందుకు సాగేది.. లేదంటే ఇంటిముఖం పట్టాల్సిందే. మంగళవారం ధర్మశాల వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య క్వాలిఫయర్ 1 జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్లనుంది. బుధవారం ముల్లాన్‌పూర్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్నాయి. ఓడిన టీమ్ ఇంటి ముఖం పడుతుంది. శుక్రవారం ముల్లాన్‌పూర్ వేదికగానే క్వాలిఫయర్2 జరగనుంది. క్వాలిఫయర్ 1లో ఓడిన జట్టు.. ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు వెళుతుంది. ఓడిన జట్టు నిష్క్రమించనుంది. ఐపీఎల్ ఫైనల్ ఆదివారం.. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనుంది. క్వాలిఫయర్ 1లో నెగ్గిన జట్టు, క్వాలిఫయర్2లో గెలిచిన జట్టు తుదిపోరులో పోటీ పడతాయి. ఇందులో నెగ్గిన జట్టు విజేతగా నిలిచి ఐపీఎల్ 2026 టైటిల్‌ను కైవసం చేసుకుంటుంది.

**డబుల్ ధమాకా**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్.. ఈ జట్లలో ఏ టీమ్ టైటిల్ గెలిచినా.. ఆ జట్టు రెండోసారి టైటిల్ గెలిచినట్లు అవుతుంది. ఫస్ట్ టైమ్ కాదు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆడుతున్న ఆర్సీబీ 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత గతేడాది ఐపీఎల్ విజేతగా నిలిచింది. ఈ సీజన్‌లోనూ గెలిస్తే.. ఆ జట్టుకు ఇది రెండో కప్పు అవుతుంది. గుజరాత్ టైటాన్స్ జట్టు 2022లో తన తొలి సీజన్‌లోనే విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. ప్రస్తుత సీజన్‌లోనూ విజేతగా నిలిస్తే ఆ జట్టుకూ ఇది రెండో టైటిల్ అవుతుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ టీమ్ 2016లో ఐపీఎల్ విజేతగా నిలిచింది. తర్వాత ఇంకెప్పుడూ టైటిల్ సొంతం చేసుకోలేదు. 2009లో డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ కప్ గెలిచింది. రాజస్థాన్ రాయల్స్ తొలిసారి 2008లో షేన్‌వార్న్ సారథ్యంలో టైటిల్ విన్నర్‌గా నిలిచింది. తిరిగి ఇప్పటి వరకు మళ్లీ కప్పు గెలవలేదు.
ఇలా ఈ నాలుగు టీమ్‌లలో ఏది గెలిచినా.. రెండోసారి టైటిల్ విజేతగా నిలిచిన జట్టుగా నిలుస్తోంది.

# బాబు జైలుకెళ్లినపుడే సీఎం అయ్యేవాడిని కదా?



**అమరావతి, మహా :** జగన్ జైలు కెళ్ళాలని తాను ఎందుకు కోరుకుంటానో ఆ లాజిక్ అర్థం కావడం లేదని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆ పిచ్చి విశ్లేషకుడి ప్రకారం తాను సీఎం కావాలని అనుకుంటే బాబు జైలుకెళ్లినపుడే ప్రయత్నాలు చేసేవాడిని కదా అన్నారు. రాజకీయ పార్టీని నడపడం అనేది అంత సులువైన విషయం కాదని, ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు చేసినా, ఎంతగా రెచ్చగొట్టినా తాను గత్యంతరం లేకే ఇంతకాలం ఓపికతో ఉన్నానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత కొంతకాలంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర రాజకీయ ప్రత్యర్థులు తనపై చేస్తున్న వ్యక్తిగత, రాజకీయ ఆరోపణలను ఆయన అత్యంత ఘాటుగా తిప్పికొట్టారు. తనను నిరంతరం టార్గెట్ చేస్తూ, తాను కులం గురించి మాట్లాడుతున్నానంటూ విమర్శలు గుప్పిస్తున్న నాయకులకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో మిగతా రాజకీయ నాయకులు కులాల గురించి, సామాజిక సమీకరణాల గురించి మాట్లాడటం లేదా అని ఆయన నిలదీశారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడు రాజకీయాలను ఈ సందర్భంగా ప్రస్తావించిన ఆయన.. అక్కడ రాజకీయాలు ఎంతో సాఫీగా, సంస్కారవంతంగా సాగిపోయాయని, తనకు అసూయ కలిగేంత చక్కగా అక్కడ నాయకులు వ్యవహరించారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.
జనసేన పార్టీపై, తన సిద్ధాంతాలపై బురదజల్లాలని చూసే శక్తులకు పవన్ కళ్యాణ్ అత్యంత తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. జనసేనపై రాళ్లు వేద్దామని చూస్తే భవిష్యత్తులో పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. "నేను కూడా మనిషినే.. సమాజంలో తిరిగే ప్రతి ఒక్కరిలాగే నాకు కూడా కోపాలు, ఆవేశాలు ఉంటాయి. ప్రత్యర్థులు నిరంతరం మమ్మల్ని కొడుతూ ఉంటే, విమర్శిస్తూ ఉంటే మేము భరిస్తూ కూర్చోవడానికి సిద్ధంగా లేము. కష్టాలు, కన్నీళ్లు, ఆత్మాభిమానం అనేవి కేవలం అవతలి పక్షానికే ఉంటాయా? మీరు ఏమన్నా.. ఎలాంటి దాడులు చేసినా మేము మూగగా భరించాలా?" అంటూ ఆయన నిప్పులు చెరిగారు. గతంలో తాను చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తుచేస్తూ.. ప్రజాస్వామ్యబద్ధంగా తాము భరిస్తామని, సహిస్తామని, కానీ హద్దులు దాటితే మాత్రం అవసరమైతే తాట తీస్తామని అత్యంత కఠినమైన పదజాలంతో హెచ్చరించారు.
ఢిల్లీ పర్యటనలు, కేంద్ర పెద్దలతో జరిపే సంభాషణలపై వస్తున్న ఊహాగానాలను కూడా పవన్ కళ్యాణ్ పూర్తిగా కొట్టిపారేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో దేశ రక్షణ, కీలక రాజకీయ వ్యూహాలపై చర్చించే విషయాలు అత్యంత గోప్యంగా ఉంటాయని, అవి బయటకు రావడం అసాధ్యమని స్పష్టం చేశారు. కొందరు రాజకీయ విశ్లేషకులు, ముఖ్యంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు వంటి వారు మీడియా వేదికలపై చెబుతున్న విషయాలన్నీ కేవలం వారి ఊహాజనిత ప్రచారాలేనని తేల్చిచెప్పారు. జగన్ మోహన్ రెడ్డి లేదా మరేదైనా పార్టీ నాయకుడు జైలుకు వెళ్లాలని తాను వ్యక్తిగతంగా ఎప్పుడూ కోరుకోవడం లేదని, తప్పు చేసిన వారికి శిక్ష పడటం అనేది చట్టం, కోర్టులు, సీబీఐ, ఈడీ పరిధిలోని అంశమని పేర్కొన్నారు. వేరే పార్టీల పతనంపై జనసేన సామ్రాజ్యాన్ని నిర్మించుకోదని, కేవలం సొంత బలం, ప్రజాదరణ, ప్రజా సమస్యలపై చేసే నిరంతర పోరాటాల ద్వారానే జనసేన క్షేత్రస్థాయిలో తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని పవన్ కళ్యాణ్ ధీమా వ్యక్తం చేశారు.



## వడదెబ్బతో వ్యక్తి మృతి

**సత్తుపల్లి, మే 25**:మహా : మండల పరిధిలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన పాలకుర్తి ఆదినారాయణ(ఆదాము) 68 సం" ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం పెనుబల్లి తాసిల్దార్ కార్యాలయంలో భూమి వివాద సమస్యపై తాసిల్దార్ కు వినతి పత్రం అందజేయడానికి టీ.వీ.ఎస్ ఎక్సెల్ పై ప్రయాణం చేస్తుండగా సుమారు ఉదయం 11 గంటల సమయంలో ఎండ తీవ్రతకు గురై ద్విచక్ర వాహనం పై నుండి కింద పడిపోయాడు. స్థానికుల సహాయంతో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమించింది అని తెలపడంతో మెరుగైన వైద్యం అందించడానికి ఆంధ్ర ప్రాంతంలోని తిరువూరు ప్రముఖ ఆసుపత్రికి తరలించారు. వైద్య సేవలు అందిస్తున్న సమయంలోనే ఆదినారాయణ (ఆదాము) మరణించారని తెలిపారు.

## పెట్రో వాత

**నాలుగురోజుల్లో లీటర్ కు రూ.7.34పెంపు**
**ఇంకా పెరిగే అవకాశం**

**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా వాహనదారులకు పెద్ద షాక్ తగిలింది. పెట్రోల్, డీజిల్ రేట్లు భారీగా పెరిగాయి. దాదాపు మూడేసి రూపాయల చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచేశాయి. సీఎన్‌జీపైనా పలు నగరాల్లో స్వల్ప పెంపు కనిపిస్తోంది. పెరిగిన ధరలు సోమవారం ఉదయం 6గం. నుంచే అమల్లోకి వచ్చాయి. పదిరోజుల వ్యవధిలో పెట్రోల్‌పై లీటర్‌కు రూ.7.34, డీజిల్‌పై లీటర్‌కు రూ.7.45 పెరిగింది. అమెరికాఇరాన్ యుద్ధంతో భారత్‌కు వచ్చే చమురు రేట్లు పెరిగిపోయింది. దీంతో నష్టాల నుంచి బయటపడేందుకు ఆయిల్ కంపెనీలకు ధరల పెంపునకు కేంద్రం అనుమతి ఇస్తోంది. సోమవారం పెట్రోల్‌పై లీటర్‌కు రూ.2.61 పైసలు, డీజిల్‌పై రూ.2.71పైసలు చొప్పున పెంచారు. మొత్తంగా పదిరోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు ఇంధన ధరలు పెంచేశారు.

## ఎండల మోత

మహా : తెలంగాణలో ఎండల తీవ్రతకు జనం పిట్టల్లా రాలుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తీవ్రమైన వడగాడ్పులు, ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో.. వడదెబ్బ కారణంగా కేవలం ఒక్క రోజులోనే 60కు పైగా మంది మృతి చెందారు. గత మూడు రోజుల్లోనే మొత్తం 154 మంది మృత్యువాత పడ్డారు. ఖమ్మం జిల్లాలోనే సోమవారం ముగ్గురు మృతి చెందారు.

## కూటమి రాత

జూన్ లో భేటీ ఉంటుందన్న మమత
కోల్‌కతా: ఇండియా కూటమి భేటీ జూన్ మొదటి వారంలోనే జరిగే అవకాశాలున్నాయని మాజీ సీఎం మమతా బెనర్జీ చెప్పారు. ఈ భేటీలో ఉమ్మడి వ్యూహాన్ని చర్చిస్తామని చెప్పారు. అధికార బీజేపీతో సుదీర్ఘ రాజకీయ పోరాటానికి తమ కూటమి సిద్ధంగా ఉందని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ఇటీవలి బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో భారీ అవకతవకలకు బీజేపీ పాల్పడిందన్నారు. కనీసం 150 నియోజకవర్గాల్లో టీఎంసీకి దక్కాల్సిన ఓట్లను తారుమారు చేశారని ఆరోపించారు. ఓడిపోయే సీట్లను గెల్చుకుని, గెలవాల్సిన చోట్ల ఓడిపోయామన్నారు. లేకుంటే టీఎంసీకి 220 నుంచి 230 సీట్లు దక్కి ఉండేవని చెప్పారు. డీఎంకే స్టాలిన్ కటీఫ్ అన్న తర్వాత జరుగుతున్న కీలక భేటీపై ఆసక్తి నెలకొంది.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

- సామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధరలు ప్రకటించాలి
- రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు డిమాండ్



**కుషాయిగూడ, మహా** : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా జవహర్ నగర్ మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రైతు సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు డి. జంగయ్య అధ్యక్షతన సోమవారం ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గత కొద్ది రోజుల్లోనే రెండుసార్లు ఇంధన ధరలను పెంచడం వల్ల రైతులు సాగు వ్యయం భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సామాన్య ప్రజలు కూడా పెట్రోల్, డీజిల్ కొనాలంటేనే భయపడే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**మద్దతు ధరల పెంపు ఒక కంటితుడుపు చర్య**

పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు అత్యంత నామమాత్రంగా ఉన్నాయని నర్సింహులు విమర్శించారు. డాక్టర్ సామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ఆధారంగా పంటలకు మద్దతు ధరలను పెంచి ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా కేంద్ర పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేవలం 72 రూపాయలు మాత్రమే పెంచడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇతర పంటలకు కూడా గతంలో ఉన్న ధరల కంటే కేవలం రెండు, నాలుగు పైసలు పెంచడం సరికాదన్నారు. కేంద్ర పాలకుల నిజస్వరూపం దీనివల్ల బట్టబయలైందని, వారి విధానాలు రైతులకు, సామాన్య ప్రజలకు ఎంత వ్యతిరేకంగా ఉన్నాయో ప్రజలు గమనించాలని కోరారు. అఖిల భారత కిసాన్ సభ పిలుపులో భాగంగానే ఈరోజు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి శంకర్, సీపీఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, జిల్లా రైతు సంఘం నాయకులు పి. చంద్రయ్య, ఎన్. చైతన్య, ఏ. సురేష్, గిరిజన సమైక్య ప్రధాన కార్యదర్శి వి. స్వరూప నాయక్, బీకేఎంయూ జిల్లా నాయకులు నరేంద్ర చారి, పి. నరసింహ, ఏఐటీయూసీ అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, వెల్డింగ్ నర్సింగరావు, సైదులు, రవితేజ తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



## కలెక్టరేట్లో ఫుడ్ మేళాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి మే 25 మహా :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సముదాయంలో నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా తొలి రోజు నిర్వహించిన ఫుడ్ మేళాను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ప్రారంభించారు.
ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యం, భద్రత మరియు పోషకాహారంపై పలు సూచనలు చేశారు. అనంతరం మహిళా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. మేళాలో తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు అందించేలా మహిళలు తయారు చేసిన వంటకాలను పరిశీలించి, వాటి తయారీ విధానం మరియు పోషక విలువల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు.
భువనగిరి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎనీమియా మరియు స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈ పరీక్షలకు 25 మంది గర్భిణీలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డీఆర్ఓ జయమ్మ, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, జిల్లా వైద్యాధికారి మనోహర్, సీడీపీవోలు వెంకటరమణ, శైలజ, స్వరాజ్యం, యామిని, మహిళా సాధికారత బృందం, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు మరియు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్రాంతి గ్రామ సమాఖ్య కి నూతన భవనం

**భూమి పూజలో పాల్గొన్న సర్పంచ్ లక్ష్మీ కుమారి**



జూలూరుపాడు, మహా:మండల పరిధి పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ లోని దండుమిట్ట తండా సంక్రాంతి గ్రామ సమాఖ్య కి నూతన భవన నిర్మాణం కొరకు ఇందిరా మహిళా శక్తి ద్వారా సుమారు పది లక్షల రూపాయల నిధులు మంజూరి అయ్యాయి. సోమవారం అట్టి భవన నిర్మాణం భూమి పూజ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సంఘం లక్ష్మీకుమారి చే విఓసిసి డి నాగేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇందిరా మహిళా శక్తి ద్వారా మంజూరి అయిన గ్రామ సమైక్య నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ భవనాలను గ్రామ సమైక్యాలు సభ్యుల సమావేశాలు తదితర వారి కార్యక్రమాలకు ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి హారిక, వార్డు సభ్యులు గోసు వరమ్మ, బాదావత్ రామకోటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లేళ్ళ అప్పిరెడ్డి, తెల్లబోయిన మల్లికార్జునరావు, వెలగా తిరుపతిరావు, మువ్వ శ్రీనివాసరావు, సంఘం చిన్న రాజు, బానోతు మంగు, భూక్య టీక్యా, సంక్రాంతి విఓఏ టి శారద, సంక్రాంతి సమైక్య అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎం బాలి, బి జయ, కోశాధికారి బి సరోజ, కార్యదర్శి డి సల్తి తోపాటు సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో దళిత సమస్యలపై వినతి పత్రం

**భద్రాద్రి బ్యూరో, మహా**:దళిత సమస్యలపై భారత రత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన మిత్రబృందంతో సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ కు వినతిపత్రం అందించారు. భవిష్యత్తులో భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఐదు లక్షల నిధులు కేటాయించాలని కోరారు.
మరమ్మతులు జరుగుతున్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కావలసిన అదనపు నిధులను కేటాయించి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది దానిని నియమ నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ కు బాధ్యతలను అప్పగించి అంబేద్కర్ కమిటీ హాల్ అభివృద్ధి కమిటీ సహకారంతో ప్రజాస్వామ్య పద్ధతిలో నడిపించాలని సూచించారు. హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహాల ప్రాంగణాన్ని "అంబేద్కర్ సెంటర్"అని నామకరణం చేయాలని అందుకు మున్సిపల్ కార్పొరేషన్ లో తీర్మానం చేయించాలని పేర్కొన్నారు.
అంబేద్కర్ విగ్రహాల ప్రాంగణాన్ని పరిరక్షిస్తూ ఆ విగ్రహాలను కనబడకుండా ఫ్లెక్సీలను ఫ్లెక్సీ హోర్డింగ్లను సర్కిల్ చుట్టూ ఫ్లెక్సీలను రాజకీయ పార్టీల జెండాలను పెట్టకుండా కఠినమైనటువంటి చర్యలను తీసుకోవాలన్నారు. సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహం పైన పెద్ద లైటును ఏర్పాటు చేసి ఇదివరకు పనిచేసినట్లుగా కలర్స్ తో ఫౌంటెన్ ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో దళిత దళారులకు, దళిత నిరుద్యోగులకు ప్రమేయం లేకుండా చేసి నిజ నిర్ధారణతో పకడ్బందీగా చట్టాలను అమలుపరచాలని పేర్కొన్నారు. 1/70 ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా గిరిజనేతరులైన దళితులకు ఇతరులకు కూడా సమానమైన విద్య ఉద్యోగాలలో సమాన హక్కులు కల్పించాలని తెలిపారు.
దళితులకు మూడు ఎకరాల భూమిని కేటాయించడంతోపాటు దళితుల భూములు అన్యాక్రాంతం కాకుండా పకడ్బందీగా చట్టాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతి పత్ర సమర్పణలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సుంద్రు రఘునాథ్ బాబు, బొమ్మెర అశోక్, పృథ్వీరాజ్, సలిగంటి శ్రీను, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 101 ఫిర్యాదులు పరిష్కారానికి చర్యలు...

**సంబంధిత అధికారులకు ఆదేశాలు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (101) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కిరణ్మయి (లోకల్ బాడీస్) వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన

**మహిళాభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత**



**కారేపల్లి, మహా :** స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయటం ద్వారా మహిళ ఆర్థికాభివృద్ధిని సాధించటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్, భాగ్యనగర్‌తండా, పేరుపల్లి, ఎర్రబోడు సర్పంచ్‌లు బానోత్ హిరాలాల్, బానోత్ పద్మా, ఈసాల అలివేలు లు అన్నారు. సోమవారం భాగ్యనగర్‌తండా, పేరుపల్లి లలో గ్రామసమాఖ్య సంఘం భవనానికి ఎంపీడీవో, సర్పంచ్‌లు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మిస్తున్న స్త్రీశక్తి భవనాల ద్వారా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం జీవో వడ్డీకే రుణాలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ వైసఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ రాజేశ్వరి, పంచాయితీ కార్యదర్శి అనిల్ కుమార్, ఉప సర్పంచ్ గుగులోత్ బిక్కులాల్, వార్డ్ సభ్యులు వాంకుడోత్ గాంధీ, సుమ, సంధ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, మల్లెల నాగేశ్వరరావు, బానోత్ రాందాస్, భూక్య రాంచందర్, బాబు, అప్పారావు, సెర్ప్ సిబ్బంది గౌస్ పాషా, అరుణ, బేగం కొనారి, నీలా, బుజ్జి స్థలదాతలు శంకర్, బుజ్జి, పంచాయితీ సిబ్బంది రాందాస్, అజ్మీర హేంచంద్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రంప్ టైమ్ గేమ్



అంతర్జాతీయంగా శత్రు దేశాలను దౌత్యపరంగా ఏకాకిని చేయడంలో, తనదైన శైలిలో బేరసారాలు సాగించడంలో డొనాల్డ్ ట్రంప్ వ్యూహాలు ఎప్పుడూ విలక్షణంగానే ఉంటాయి. తాజాగా, "డీల్ కోసం తొందరపడొద్దు.. సమయం మాకే అనుకూలంగా ఉంది" అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్య అంతర్జాతీయ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపింది. ఈ వ్యాఖ్య వెలువడిన క్షణం నుంచే ప్రపంచ ఆర్థిక మార్కెట్లు, ముడిచమురు ఉత్పత్తి దేశాలు, దౌత్య వర్గాల్లో ఒక్కసారిగా ఉత్కంఠ, ఆందోళన మొదలయ్యాయి. మధ్యప్రాచ్యంలో ఒక యుద్ధ వాతావరణం ముగిసిపోతోందని భావిస్తున్న తరుణంలో, అసలు సిసలైన 'మైండ్ గేమ్' ఇప్పుడే ప్రారంభమైందనే సంకేతాలను ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది. ట్రంప్ తాజా వైఖరిని లోతుగా పరిశీలిస్తే, అమెరికా వ్యూహం కేవలం ఇరాన్‌తో తాత్కాలికంగా యుద్ధాన్ని ఆపడం లేదా కాల్పుల విరమణ జరపడం మాత్రమే కాదని అర్థమవుతుంది. వాషింగ్టన్ ఇప్పుడు ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒత్తిడిని కొనసాగిస్తూ, ఇరాన్‌ను కోలుకోలేని దెబ్బతీసేలా ఒక భారీ రాజకీయఆర్థిక ఒప్పందాన్ని సాధించాలని భావిస్తోంది. ఈ వ్యూహంలో అమెరికా ప్రధానంగా మూడు అజెండాలను ముందుకు తెస్తోంది. మొదటిది, ఇరాన్ అణు కార్యక్రమాలపై శాశ్వత, పూర్తిస్థాయి ఆంక్షలు విధించడం ద్వారా ఆ దేశాన్ని అణ్వాయుధ దేశంగా ఎదగకుండా అడ్డుకోవడం. రెండొవది ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి'లో అమెరికా, దాని మిత్రదేశాల నౌకల రాకపోకలకు పూర్తి స్వేచ్ఛను కల్పించుకోవడం. మూడోది, మధ్యప్రాచ్యంలో ఇరాన్ ప్రాబల్యాన్ని, దాని ప్రాక్సీ ముఠాలను నిర్వీర్యం చేసి అమెరికాఇజ్రాయెల్ కూటమి పట్టును మరింత బలోపేతం చేయడం. మొత్తంగా, ఆర్థిక ఆంక్షల ద్వారా ఇరాన్‌ను పూర్తిగా బలహీనపరిచి, విసిగిపోయిన స్థితిలో తమ షరతులకు లొంగిపోయేలా చర్చల బల్ల ముందుకు తీసుకురావడమే ట్రంప్ 'లాంగ్ గేమ్' యొక్క ముఖ్య ఉద్దేశం.


మరోవైపు అమెరికా తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నప్పటికీ ఇరాన్ పూర్తిగా లొంగిపోయిందని చెప్పలేం. ప్రస్తుత పరిణామాల ప్రకారం టెహ్రాన్ ఈ ప్రతిపాదనలకు "పాక్షికంగానే" సానుకూలత వ్యక్తం చేసింది. చర్చలకు సిద్ధమేనని ప్రకటిస్తున్నప్పటికీ, అమెరికా విధిస్తున్న కఠిన షరతులకు మాత్రం ఇరాన్ ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ముఖ్యంగా యురేనియం నిల్వలను తగ్గించుకోవడం, అణు కార్యక్రమాలను పూర్తిగా పరిమితం చేయడం, వీటన్నింటికీ మించి అంతర్జాతీయ అణు శక్తి సంస్థ ముందస్తు నోటీసులు లేకుండా దేశంలో ఎప్పుడైనా తనిఖీలు చేయడానికి పూర్తి అనుమతి ఇవ్వడం వంటి అంశాలపై ఇరాన్ తీవ్రంగా విభేదిస్తోంది. ప్రస్తుతానికి ఇరాన్ వైఖరి "ముందు ఆంక్షలు సడలించండి.. తర్వాతే మా నిర్ణయం చెబుతాం" అన్న చందంగా ఉంది. అమెరికా విధించిన కఠిన ఆర్థిక ఆంక్షలను తక్షణమే ఎత్తివేయడం, విదేశీ బ్యాంకుల్లో స్తంభించిపోయిన ఇరాన్‌కు చెందిన బిలియన్ల డాలర్ల ఆస్తులను విడుదల చేయడం, యుద్ధం అధికారికంగా ముగిసిందనే అంతర్జాతీయ హామీని ఇవ్వడం వంటి అంశాలను టెహ్రాన్ ప్రాథమిక షరతులుగా పెడుతోంది. వీటన్నింటికీ మించి, హర్మూజ్ జలసంధిని మూసివేస్తామనే హెచ్చరికను ఇరాన్ ఇప్పటికీ అమెరికాపై ఒత్తిడి తెచ్చే వ్యూహాత్మక ఆయుధంగానే వాడుకుంటోంది.

ఇరు దేశాల మధ్య తీవ్రమైన బేరసారాలు నడుస్తున్న నేపథ్యంలో, ట్రంప్ సైతం వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. "నిర్దిష్టమైన పూర్తి ఒప్పందం కుదిరే వరకు ఆర్థిక, వ్యూహాత్మక బ్లాకేడ్ (దిగ్బంధం) ఇలాగే కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేయడం ద్వారా ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు పంపారు. అంటే భౌతిక దాడులు ఆగినా, ఆర్థిక ఆంక్షల ఉచ్చు మరింత బిగుస్తుందని అమెరికా చెబుతోంది. ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి తెరవెనుక పాకిస్థాన్, ఖతార్, ఒమన్ వంటి దేశాలు తీవ్రంగా మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. దౌత్య వర్గాల సమాచారం ప్రకారం.. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య ఒక 'తాత్కాలిక అవగాహన ఒప్పందం'కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా యుద్ధాన్ని అధికారికంగా ముగించడం, హర్మూజ్ మార్గాన్ని తాత్కాలికంగా తెరవడం, ఆపై తదుపరి 30 లేదా 60 రోజుల పాటు ఇరుదేశాల మధ్య అణు అంశాలపై లోతైన చర్చలు జరపడం వంటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

ఈ అంతర్జాతీయ దౌత్య యుద్ధంలో ట్రంప్‌కు కేవలం ఇరాన్ నుంచే కాకుండా స్వదేశంలోనూ, మిత్రదేశాల నుంచో ఒత్తిడి పెరుగుతోంది. "మూడు నెలల క్రితమే ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని, దాని ప్రాక్సీలను పూర్తిగా ధ్వంసం చేశామని ప్రకటించారు కదా.. మరి ఇప్పుడు మళ్లీ అదే దేశంతో కూర్చొని రాజీ చర్చలు, రాయితీలు ఎందుకు?" అని సొంత రిపబ్లికన్ పార్టీకి చెందిన కొందరు నేతలు ట్రంప్‌ను ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అమెరికా వ్యూహాత్మక భాగస్వామి అయిన ఇజ్రాయెల్ మాత్రం, ఇరాన్ అణు కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేసేవరకు ఎలాంటి ఒప్పందాలు చేసుకోవద్దని, శత్రువును ఇప్పుడే పూర్తిగా అణచివేయాలని గట్టిగా పట్టుబడుతోంది.

యుద్ధక్షేత్రంలో ఆయుధాల మోత తగ్గి, శాంతి నెలకొంటున్నట్లు పైకి కనిపిస్తున్నా, దౌత్యరంగంలో అసలు సిసలైన వ్యూహాత్మక సమరం ఇప్పుడే మొదలైంది. ట్రంప్ "సమయం మా వైపే ఉంది" అని కాలయాపన చేస్తూ ఇరాన్‌ను ఆర్థికంగా మరింత దిగజార్చాలని చూస్తుంటే.. ఇరాన్ మాత్రం "మా షరతులు నెరవేరిస్తేనే ముందడుగు" అని మొండిగా పట్టుబడుతోంది. ఈ అంతర్జాతీయ మైండ్ గేమ్ మరియు బేరసారాలు ముమ్ముందు ఏ దారి తీస్తాయనే దానిపైనే రాబోయే రోజుల్లో ప్రపంచ చమురు ధరల స్థిరత్వం, అంతర్జాతీయ మార్కెట్ల గమనం, మధ్యప్రాచ్య భద్రత ఆధారపడి ఉన్నాయి. ట్రంప్ తాజా వ్యాఖ్యలు మళ్ళీ ప్రపంచాన్ని ఉత్కంఠతకు, ఆందోళనకు గురిచేస్తున్నాయి.

# తెలుగు నేలపై భానుడి రౌద్రరూపం



రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వేసవి ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. గత కొన్ని దశాబ్దాల రికార్డులను తిరగరాస్తూ భానుడి తీవ్రత అసాధారణంగా పెరగడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణవ్యాప్తంగా పగటిపూట సాధారణ జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. రికార్డు స్థాయిలో 48.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు, నిరంతరాయంగా వీస్తున్న తీవ్ర వడగాడ్పుల కారణంగా ఈ ఏడాది వేసవి ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు వడదెబ్బకు గురై రెండు రాష్ట్రాల్లో కలిపి వందకు పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తరిస్తున్న ఈ వేసవి విలయం, మరోవైపు అసాధారణ ఉష్ణోగ్రతల వల్ల తలెత్తుతున్న షార్ట్ సర్క్యూట్లతో కోట్ల రూపాయల ఆస్తి నష్టాన్ని మిగులుస్తున్న ఘోర అగ్నిప్రమాదాలు తెలుగు రాష్ట్రాలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న ఉమ్మడి రాష్ట్రాల ప్రభుత్వాలు అత్యవసర 'రెడ్ అలర్ట్' ప్రకటించి, క్షేత్రస్థాయిలో ప్రజల ప్రాణ రక్షణే ధ్యేయంగా యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాయి.

## రికార్డు స్థాయి గరిష్ట ఉష్ణోగ్రతలు

ఈ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు మునుపటి రికార్డులన్నింటినీ తిరగరాస్తూ అత్యంత భయంకరమైన స్థాయికి చేరుకున్నాయి. గత కొన్ని రోజులుగా వరుసగా వడగాడ్పులు కొనసాగుతుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని చిట్యాలలో ఏకంగా 48.3 డిగ్రీల అసాధారణ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణ రాష్ట్రంలో పరిశీలిస్తే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కుంచవెల్లి, కాగజ్‌నగర్ ప్రాంతాలతో పాటు జగిత్యాల జిల్లా ధర్మపురిలో అత్యధికంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, ఖమ్మం రూరల్ మండలం పల్లిగూడెం, వైరా ప్రాంతాలలో కూడా ఉష్ణోగ్రతలు 46.3 డిగ్రీలుగా రికార్డయ్యాయి. ఈ ప్రాంతాలలో గత పది రోజులకు పైగా నిరంతరాయంగా పగటి ఉష్ణోగ్రతలు నలభై ఐదు డిగ్రీలకు పైనే నమోదు కావడం గమనార్హం.

## మరణాల సంఖ్య 100 దాటిన విలయం

ఈ వేసవి కాలంలో వడదెబ్బ కారణంగా తెలుగు రాష్ట్రాలలో మరణాల సంఖ్య భారీగా పెరిగింది. విపత్తు నిర్వహణ శాఖలు , స్థానిక క్షేత్రస్థాయి నివేదికల ప్రకారం గత మూడు రోజులుగా ఎండ తీవ్రత ఊహించని విధంగా పెరగడంతో రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం మరణాల సంఖ్య 100 దాటింది. కేవలం శనివారం ఒక్కరోజునే రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 67 మంది వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోగా, అందులో తెలంగాణలో 40 మంది, ఏపీలో 16 మంది బలయ్యారు. అయితే జిల్లా కలెక్టర్ల నుండి అందిన నివేదికల ప్రకారం తెలంగాణలో 16 మరణాలను ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించింది. మరణాల సంఖ్య రోజురోజుకూ వేగంగా పెరుగుతుండడంతో రెండు రాష్ట్రాల ఆరోగ్య శాఖలు అత్యవసర రక్షణ చర్యలు ముమ్మరం చేశాయి. తెలంగాణ రాష్ట్రంలో నమోదైన వడదెబ్బ మరణాల విస్తృతిని పరిశీలిస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా అత్యంత తీవ్రంగా ప్రభావితమై అత్యధికంగా ఇరవై మూడు మందిని కోల్పోయింది. ఆ తర్వాత స్థానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలిచి అక్కడ పెద్దపల్లి, కరీంనగర్ పరిధిలో కలిపి పదకొండు మంది మృత్యువాత పడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో భద్రాద్రి కొత్తగూడెం మరియు ఖమ్మం ఏరియాలలో కలిపి ఏడుగురు భానుడి భగభగలకు బలయ్యారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఐదుగురు, ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఐదుగురు ఎండ తీవ్రతకు చనిపోయారు. ప్రభుత్వ అధికారిక ధృవీకరణ నివేదికల ప్రకారం జయశంకర్ భూపాలపల్లిలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలలో తలా ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా వడదెబ్బ మరణాల సంఖ్య ఆందోళనకరంగా పెరిగి ఇక్కడి జిల్లాలలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా , విజయవాడ నగర పరిధిలో ఎండ తీవ్రతకు అత్యధికంగా పది మంది ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి మరియు ఏలూరు జిల్లాల పరిధిలో ఏడుగురు వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో తలా నలుగురు చొప్పున చనిపోగా, తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇద్దరు బలయ్యారు. అలాగే అనకాపల్లి జిల్లాలో ఒకరు చనిపోయినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లోని పారిశుద్ధ్య కార్మికులు, వలస కూలీలు ఎండ తీవ్రతను తట్టుకోలేక రోడ్లపైనే స్పృహతప్పి పడిపోయి మరణించారు.

వివిధ జిల్లాల నుండి అందిన క్షేత్రస్థాయి నివేదికల ప్రకారం మరణించిన వారిలో అత్యధికులు వృద్ధులు, దినసరి వలస కూలీలు , నిరాశ్రయులే ఉన్నారు. కరీంనగర్ , పెద్దపల్లి జిల్లాలలో పెద్దపల్లి టౌన్‌కు చెందిన ఫయాజ్, మరేడుగొండకు చెందిన గొర్రెల కాపరి కోర మల్లయ్య, సుల్తానాబాద్‌కు చెందిన న్యాథరి మొండయ్య, రాముగిరి మండలం ఆదివారంపేటకు చెందిన బూడిగ కమల ఎండ తీవ్రతకు బలయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో అశ్వాపురం మండలం మొండికుంటకు చెందిన జెట్టి పూలమ్మ, పాల్వంచకు చెందిన పి. వెంకటేశ్వరరావు, జులూరుపాడు మండలం కరివారిగూడెంకు చెందిన ధరావత్ నరసింహారావు, భద్రాచలానికి చెందిన నరేష్ వడదెబ్బతో మరణించారు. ఏపీలోని పల్నాడు జిల్లా వేమవరానికి చెందిన జల్లా కొండలు, కోటికపాలుడికి చెందిన మేకా నిర్మల, అనకాపల్లి జిల్లాకు చెందిన వికలాంగుడు గాడిగోయిల సత్యనారాయణ వడదెబ్బతో మరణించినట్లు క్షేత్రస్థాయిలో గుర్తించారు.

ఎండల తీవ్రతకు తోడు విద్యుత్ వినియోగం విపరీతంగా పెరగడంతో తెలుగు రాష్ట్రాలలో ఘోర అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా తెలంగాణలోని మేడిగడ్డ వద్ద ఉన్న ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది, అక్కడ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగసిపడి కార్యాలయానికి సంబంధించిన అనేక కీలక పత్రాలు, కంప్యూటర్లు పూర్తిగా బూడిదయ్యాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లోని ఉమ్మడి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో కూడా భారీ అగ్నిప్రమాదం సంభవించి విద్యుత్ ఉత్పాదనకు ఆటంకం కలిగింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఒక పెద్ద ప్యాకింగ్ పరిశ్రమలో సంభవించిన ప్రమాదం, గుంటూరు , హైదరాబాద్‌లోని జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాలలోని రసాయన గిడ్డంగిలలో జరిగిన అగ్నిప్రమాదాలు కోట్ల రూపాయల నష్టాన్ని మిగిల్చాయి. వ్యవసాయ రంగంలో కోతకు వచ్చిన వందలాది ఎకరాల వరి పంట, పత్తి నిల్వలు మరియు ఆయిల్ పామ్ తోటలు బూడిదయ్యాయి.

పరిస్థితి తీవ్రతను గమనించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో అత్యవసర సమీక్షలు నిర్వహించారు. వడదెబ్బ మరణాలను అరికట్టడానికి జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు అప్పగించారు. వడదెబ్బ కారణంగా మరణించిన వారి కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియాను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాలలో వడగాడ్పుల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నందున, ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉంటూ మధ్యాహ్నం వేళల్లో ఇళ్ల నుండి బయటకు రావొద్దని, తగినన్ని నీరు , ద్రవపదార్థాలు తీసుకుంటూ సురక్షితంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.



# పవన్.. గోదావరి మిషన్

### పుష్కరాల పనులపై ఆగ్రహం.. ఇంకా డీపీఆర్‌లు సిద్ధం కాలేదా?

### ఒకే ఏడాదిలో హడావుడిగా పనులు చేస్తే ఒప్పుకోను

### తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకూడదు

### గోదావరి పుష్కరాల సమీక్షలో పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు



**రాజమండ్రి, మహా:** రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకకు ఇప్పటివరకు సరైన సన్నద్ధత కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాల కోసం సుమారు రూ. 8,600 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులకు ఇప్పటికీ డీపీఆర్‌లు (వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు) సిద్ధం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాగితాలపై ప్రణాళికలు చూపించడం కాకుండా, క్షేత్ర స్థాయిలో పనులు కనిపించాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి వివరించాలని అధికారులను ఆదేశించారు.

#### హడావుడిగా పనులు చేస్తే నాణ్యత మటాష్

సరైన ప్రణాళిక లేకుండా ఒకే ఏడాదిలో 7 వేల పనులు హడావుడిగా చేస్తే నాణ్యత పూర్తిగా దెబ్బతింటుందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. "పాడైపోయిన సిమెంట్‌తో పనులు చేసి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. స్పష్టమైన డేటా లేకుండా అడిగితే కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వదు" అని తేల్చిచెప్పారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

#### కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్

గత పుష్కరాల సమయంలో జరిగిన తొక్కిసలాట వంటి దురదృష్టకర ఘటనలు ఈసారి పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. పుష్కరాల ఏర్పాట్లను కేవలం నగరాలకే పరిమితం చేయకుండా ఆరు జిల్లాల్లోని 274 పంచాయతీల వరకు విస్తరించాలని ఆదేశించారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేకంగా ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ పుష్కరాల సన్నద్ధత అంశాన్ని త్వరలోనే రాష్ట్ర కేబినెట్ భేటీలో చర్చిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. పుష్కరాల నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒక ఆశాకిరణంలా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రష్యా- ఉక్రెయిన్ యుద్ధం



రష్యా ఉక్రెయిన్ యుద్ధం మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. రష్యా పై పెట్రేగి పోతున్న ఉక్రైన్ ఇటీవల జరిపిన డ్రోన్ దాడులు మునుపెన్నడు లేని విధంగా దాడి చేసింది. ఇంత వరకు రష్యా పై ఉక్రైన్ జరిపిన దాడులలో ఇదే పెద్దది. ఈ దాడుల వల్ల రష్యాలోని అనేక పెద్ద, పెద్ద భవంతులు, మౌలిక సౌకర్యాలు ద్వంసం అయినవి. దీనికి విరుగుడుగా రష్యా డ్రోన్ దాడికి మేము భయపడలేదు. మా జాగ్రత్త లో మేము ఉన్నాం. ఉక్రెయిన్ కు సంబందించిన ఆరు వందల డ్రోన్లు, మరియు కొద్ది సేపటికే ఒక వెయ్యి డ్రోన్లు ఎందుకు పనికి రాకుండా నేల మట్టం చేశామని రష్యా ప్రకటించింది. ఇది ప్రతి కార దాడి మాత్రమే అని రష్యా ప్రకటించిన దరిమలా, ఇక మేము ఏమాత్రం ఉపేక్షించమని, ఉక్రెయిన్ రాజధాని కీవ్ మీద దాడి భయంకరంగా ఉంటుందని రష్యా ప్రకటించింది. రష్యా ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో క్షిపణి, డ్రోన్ దాడులు జరిపినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇలా పరస్పర దాడులతో రష్యా, ఉక్రైన్ యుద్ధం మరో కోణం లోకి వెళ్ళిపోయింది. ఈ యుద్ధం దాదాపు నాలుగేళ్లుగా సాగుతోంది. ఇరువైపులా అనేక మంది మరణించారు. ఇరాన్ పై అమెరికా, దాడుల వలన ఇప్పుడు విశ్వం అంతా రష్యా, ఉక్రైన్ యుద్ధం మరచి పశ్చిమ ఆసియాపై దృష్టి కేంద్రికరించారు. అయినా కూడా రష్యా, ఉక్రైన్ యుద్ధం వలన తీవ్ర వినాశనం జరుగుతూనే ఉంది.యుద్ధం త్వరలో ముగుస్తుంది అని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పిన మాట నమ్మ శక్యం గా లేదు. మేము పుతిన్ కు బుద్ధి చెప్పడానికే ఇది వరకు ఎన్నడు లేని అత్యంత శక్తి వంతమైన డ్రోన్లతో దాడి చేశాం అని జెలెన్ స్కీ ఉవాచ. రష్యాను దారికి తేవాలంటే యూరోపి యన్ దేశాలే చొరవ తీసుకోవాలి.అయితే యూరోపియన్ దేశాలు శాంతికి ప్రయత్నించడం లేదు. యుద్ధం ఆగితే భారత్ తోనే ఆగవచ్చు అని అనేక మంది నమ్మకం. ఈ విషయంలో మోదీ వ్యాక్య లు మననం చేసుకుంటే "ఇది యుద్ధలా యుగం కాదు " ఈ మాట జ్ఞప్తికి వస్తుంది. పుతిన్ రాజీకి రావడమే శ్రేయస్కరం అని జెలెన్ స్కీ మాటగా ఉంది. యుద్ధం ఆగిపోవాలని నార్వే ప్రధాని కూడా, భారత్ జోక్యం తో రష్యా, ఉక్రైన్ యుద్ధం ముగింపు దశకు వస్తుందని వ్యాఖ్యనించారు.మరి రెండు దేశాలు కూడ మైత్రి దిశలో పయనించాలి. ఏ దేశం కూడా భీకరమైన దాడులు చేయకుండా ఉండాలి. అయింది ఏదో అయింది యుద్ధం రావడం ఉక్రెయిన్ తప్పిదమో, రష్యా తప్పిదమో కాని ఇప్పటికే యుద్ధ నష్టాలు, చేసిన గాయాలు ఆర్థిక అస్థిరత్వం స్పష్టంగా కనిపిస్తోంది.ఈ సెప్టెంబర్ లో భారత్ కు రానున్న పుతిన్ పై మోదీ ఒత్తిడి తీసుకు రావాలి. యుద్ధం వలన ఏమి సాధించలేమని, అభివృద్ధి సాగదని పుతిన్ కు, మోదీ నచ్చ చెప్పాలి.

**- కనుమ ఎల్లారెడ్డి, 9391523027.**



## నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంటశాల నర్మదకి చేయూత

**బూర్గంపహాడ్ మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సారపాక కు చెందిన వంటశాల నర్మద కు రూ 8,000/ ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈమె భర్త ప్రభాకర్ స్థానిక ఐ టి సి కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. వీరికి 5 సంవత్సరములు ,18 నెలల వయస్సు కలిగిన ఇద్దరూ ఆడ పిల్లలు వున్నారు.వీరి స్వస్థలం పాల్వంచ మండలం దంతెలబోరు కాగా ఉపాది కోసం సారపాక వచ్చి అద్దె ఇంట్లో నివాసం వుంటూ ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు.పేద కుటుంబం కావడం వలన ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ ప్రభాకర్ కు వచ్చే సంపాదనతోనే భార్య ,పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు.కానీ విధి వారిని చిన్న చూపు చూడటంతో ఇటీవల జరిగిన ప్రమాదంలో నర్మద కు రెండు కాళ్ళు ,చాతి పక్కటెముకలు విరిగి పోవడంతో మంచానికే పరిమితమైనది.ఈ విషయం నేస్తం ట్రస్ట్ దృష్టికి రావడంతో ఈ రోజు వారి ఇంటి వద్దకు వెళ్లి నర్మద ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండా రెడ్డి మాట్లాడుతూ ప్రభాకర్ కుటుంబ దయనీయ పరిస్థితిని చూసి కొంతమంది దాతలు ముందుకు వచ్చి అందించిన ఆర్థికంగా సహాయం తో పాటు ,అతను మరికొంత అప్పు చేసి భార్య నర్మద కు వైద్యం చేయించాడు,అయినప్పటికీ ఆమె కు పూర్తిగా కోలుకోవాలంటే సుమారుగా 5 నుండి 6 నెలలు సమయం పట్టవచ్చని వైద్యులు చెప్పడంతో వైద్య ఖర్చులకు మరియు కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.ఇద్దరూ చిన్నారుల తో సంతోషంగా ఉన్న వారి కుటుంబంలో ఒక్కసారిగా నర్మద ప్రమాదానికి గురికావడం వారిని తీవ్ర మనస్తాపానికి గురి చేసింది .ప్రభాకర్ ఆర్థిక ఇబ్బంది ,నర్మద పడుతున్నా మానసిక,శారీరక వేదన తమకు ఎంతో భాద కలిగించిందని, వారి కుటుంబానికి నేస్తం ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపి రూ 8,000/ ఆర్థిక సహాయం అందించడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింత అంకిరెడ్డి,గౌరవ సలహాదారులు సంకా సురేష్ ,సభ్యులు దుగ్గిరెడ్డి బాలనారాయణ రెడ్డి ,సోము రఘునాధ రెడ్డి ,జింకల రాంగోపాల్ రెడ్డి ,కైపు రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## డ్రైనేజీల ఆక్రమణల పై అధికారుల ఉదాసీనత.

- పట్టించుకోని అధికార యంత్రాంగం.
- పొంచిఉన్న ప్రమాదాలకు భా-ద్యులెవరు...?
- పాదచారులకు రోడ్లపై అవకాశం కరువు.



**దమ్మపేట ,మే 25 మహా** : దమ్మపేట మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు కానీ రోడ్లను విస్తరించడం మరిచారంటూ స్థానికులు ఆగ్రహిస్తున్నారు. రోడ్డు కు ఇరువైపులా దాదాపుగా రోడ్డు సెంటర్ బాగం నుండి 50 అడుగులు దూరంలో పక్కా డ్రైనేజీలు నిర్మించారు. కానీ అవి పూర్తిగా స్వాదీనమయ్యాయనే విషయాన్ని అధికారులు మరిచారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

**రోడ్డుకు ఒక వైపు మాత్రమే ఆక్రమణలు :**
రోడ్డుకు ఇరువైపులా లక్షల ఖర్చుతో డ్రైనేజీలు నిర్మించారు. వాటిలో పూడిక తీత మాట ఎలా ఉన్నా కొంతవరకు మురికినీరు ప్రవహిస్తూనే ఉంది. మరొక ప్రక్కన ఉండాల్సిన డ్రైనేజీ మచ్చుకైనా కనిపించదు. దానిపై ఆక్రమణలు మాటల్లో చెప్పలేనంతగా ఉన్నాయనడంలో సందేహం లేదు.అసలు మరొకవైపున డ్రైనేజీ నిర్మించారా...? అన్నట్లుగా కనిపిస్తుంది.

**ఏకంగా మూడు కిలోమీటర్ల పొడవునా ఆక్రమణ :**
పట్టణంలో ఉన్నడ్రైనేజీ ఏకంగా మూడు కిలోమీటర్ల పొడవునా ఆక్రమణకు గురైంది. డ్రైనేజీ లపై ఏకంగా స్లాబులు వేసుకుని ఏకంగా పక్కా షాపులు నిర్మించుకున్నారు. ఎప్పుడైనా డ్రైనేజీలు శుభ్రం చేయాలంటే.... ఇంకా అంతే సంగతులు మరి.

**ముఖ్యంగా పాఠశాల ఆవరణ ముందర :**
విద్యార్థులు ప్రతిరోజు పాఠశాల కు వెళ్ళే సమయంలో ,పాఠశాల ముందర డ్రైనేజీ పై ఉన్న ఆక్రమణల వలన మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల కు వచ్చే సమయంలో విద్యకు సంబందించిన ఆహ్లాదకరమైన వాతావరణం లేకుండా వ్యాపార లావాదేవీలు ,అందునా పోకిరీలు ఉంటున్నారని తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. యుక్తవయస్సున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడుగు పెట్టాలంటేనే సమస్యగా ఉందని ఆవేదన చెందుతున్నారు. పాఠశాల ప్రహరీలకు దేశ నాయకుల చిత్రపటాలను అందంగా చిత్రీకరణ చేస్తే విద్యార్థులలో దేశభక్తితో పాటుగా చదువు లపై ఆసక్తి కనబడే అవకాశం ఉన్నట్లు తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ఆక్రమణలపై అక్రమ వ్యాపారాలు :**
డ్రైనేజీ ఆక్రమణలు చేసిందే గాక వాటిపై ప్రజాహానికర వ్యాపారాలు ,గుట్కా అమ్మకాలు ,మద్యం వంటి మత్తుపానీయాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు కొందరు ఆరోపిస్తున్నారు. ఏకంగా తన స్వంత స్థలం మాదిరిగా పక్కాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఐనప్పటికీ మండలంలోని అధికారులు మాత్రం వారిపై చర్యలు తీసుకోవడంలో మీన మేషాలు లెక్కిస్తున్నారు.

**డ్రైనేజీ నిర్మాణాలు ఎందుకు ..?**
లక్షల రూపాయల ప్రజాధనంతో డ్రైనేజీలు నిర్మాణం చేపట్టింది కేవలం కొందరికి అప్పగించడం కోసమేనా....? వేల రూపాయల షాపుల అద్దెలు చెల్లించుకుంటూ ఒక వైపున వ్యాపారులు అద్దెకు ఉంటే...మరొక వైపున మాత్రం దర్జాగా డ్రైనేజీ లు ఆక్రమించుకొని వేల రూపాయల సొమ్మును వెనుకేసుకుంటున్నారని కొందరు వ్యాపార సంస్థల యజమానులు ఆక్రందన చెందుతున్నారు. పంచాయతీ పాలకులు సైతం దద్దమ్మలు గా చూస్తున్నారని బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఎందుకు ఈ వివక్ష చూపుతున్నారు... ?అంటూ ఎందరో ప్రశ్నిస్తున్నారు. అసలు డ్రైనేజీ ఆక్రమణల ను తొలగించడంలో అధికారులు ఎందుకు చొరవచూపడం లేదో తెలియడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

**డ్రైనేజీ లపై షాపులకు పంచాయతీ అనుమతులు ఎలా ...?**
షాపులు ,వర్తక వ్యాపారాలు చేసుకోవాలంటే పంచాయతీ అనుమతులు తప్పనిసరి అవసరం ఉంటాయి. మరి డ్రైనేజీ లపై ఆక్రమణలు చేసిన వారికి షాపులకు అనుమతులు ఎలా ఇస్తున్నారనే అంశంపై స్థానికులు అయోమయంలో ఉన్నారు. కొందరు నిజాయితీగా వ్యాపారం చేయాలంటే ఎన్నో షరతులతో కూడిన పత్రాలు అవసరం అంటూ ,పదే పదే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేపిస్తారు. మరి ఆక్రమణల లో ఉన్న వారికి ఇవేమి అవసరం లేదా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా న్యాయం అందరికీ ఒకటేనా...? లేక కొందరికోసమేనా...?అంటూ అధికారుల తీరుపై ప్రజలు భగ్గుమంటున్నారు.డ్రైనేజీ లపై ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.



## గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు..

- పోషకాహారంపై అవగాహన సదస్సు..

**మణుగూరు, మహా** : మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు హీమోగ్లోబిన్, బీపీ, డయాబెటిస్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించి గర్భిణీలు తీసుకోవలసిన పోషకాహారం, గర్భధారణ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, సాధారణ ప్రసవం కోసం అనుసరించాల్సిన ఆరోగ్య నియమాలపై వైద్యులు అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జయలక్ష్మి, వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ ఉమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిని, రాంప్రసాద్, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## తలరాతను మార్చే చేతిరాత...

- కాలిగ్రఫీ వైపు విద్యార్థుల పరుగులు
- కాలిగ్రఫీ వల్ల ఎన్నో ఉపయోగాలు
- నిపుణురాలు కె.హిమబిందు



**భద్రాద్రి బ్యూరో, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కూలీలైన్ ప్రాంత నివాసి అయిన కె.హిమబిందు చిన్ననాటి నుండి కాలిగ్రఫీ పట్ల ఆసక్తి ఏర్పరచుకొని తమ గమ్యం వైపు అడుగులు వేస్తూ కాలిగ్రఫీలో హైదరాబాద్ లోని ప్రముఖ విద్యా సంస్థలో కాలిగ్రఫీ పట్టా అందుకుంది. దీంతో జిల్లాలోని కూలీ లైన్ నివాసంలో నికోలస్ కాలిగ్రఫీ ఇన్స్టిట్యూట్ ను ప్రారంభించి ఎంతోమంది బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఈ యొక్క కాలిగ్రఫీని అభ్యసింప చేస్తున్న హిమబిందు పలువురి మన్ననలను పొందుతుంది. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ కాలిగ్రఫీ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. మన తలరాతను మార్చేది కేవలం చేతి రాతయని స్పష్టం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో వారి లక్ష్యాలను చేరుకోవాలన్న నెరవేర్చుకోవాలన్నా చేతిరాత ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని చెప్పారు. పేద విద్యార్థులకు వేసవి శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా కాలిగ్రఫీని నేర్పిస్తూ విద్యార్థుల యొక్క భవిష్యత్తును చక్కదిద్దుకునే అవకాశాన్ని కాలిగ్రఫీ ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో కాలిగ్రఫీ వల్ల పలు ప్రయోజనాలు ఉండనున్నాయని అందులో భాగంగా వేసవి శిబిరాలను ఏర్పాటు చేసి తద్వారా సుమారు 20 మంది విద్యార్థులను ఒక జట్టుగా ఏర్పాటు చేసి వారికి ఈ కాలిగ్రఫీలో శిక్షణ ఇస్తూ వారి యొక్క మానసిక స్థితిని మెరుగుపరచుకుంటూ పలు ప్రయోజనాలు పొందుతున్నారని తెలిపారు. సాధన వల్ల అందమైన స్పష్టమైన చేతిరాత వస్తుందన్నారు. అంతేకాకుండా
ఏకాగ్రత సైతం పెరుగుతుందన్నారు. అక్షరాలను జాగ్రత్తగా రాయడం వల్ల దృష్టి ఏకాగ్రత మెరుగవుతుందని చెప్పారు. మనసుకు ప్రశాంతత లభిస్తుందని నెమ్మదిగా కళాత్మకంగా రాయడం ఒత్తిడిని తగ్గిస్తుందని వివరించారు. సృజనాత్మకతను కూడా పెంచుతుందన్నారు.కొత్త అక్షర శైలులు ఆకృతి మంచి ఆలోచనలను పెంచుతాయని చెప్పారు. సహనాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. చేతి కదలికలలో నైపుణ్యం మెరుగవుతుందని సమన్వయం బలపడుతుందని ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. అందమైన రాతను చూసి ఆనందం నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. అలంకరణ కళలో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆహ్వాన పత్రాలు గ్రీటింగ్ కార్డులు పోస్టర్లు కళాకృతుల్లో కాలిగ్రఫీ ఉపయోగం తద్వారా విద్యార్థులు భవిష్యత్తులో వారి లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబరు:8008693494ను సంప్రదించాలని హిమబిందు పేర్కొన్నారు.

## మణుగూరులో రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి..

**మణుగూరు, మహా** : మణుగూరు మండలం శేషగిరి నగర్‌కు చెందిన వృతిక్ (20) ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.పినపాక - మణుగూరు సరిహద్దులోని చిక్కుడుగుంట భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలో **ఉదయం సుమారు 6**:15 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి సమాచారం మేరకు స్కూటీపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తుండగా వాహనం అదుపుతప్పి కల్వర్ట్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృతిక్‌కు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. అదే స్కూటీపై ఉన్న మరో ఇద్దరు యువకులు కూడా తీవ్రంగా గాయపడగా, స్థానికులు అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

## 14వ వార్డులో నూతన ట్రాన్స్ఫర్ నిర్మాణ పనులకు

- పూజా కార్యక్రమం
- ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లకు సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన 14వ వార్డు ప్రజలు

**బూర్గంపహాడ్ మహా** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ రిక్షా కాలనీలో నూతన ట్రాన్స్ఫరం నిర్మాణ పనులకు పూజా కార్యక్రమం విద్యుత్ శాఖ అధికారి ఉపేందర్ రావు మరియు 13వ 14వ వార్డు మెంబర్లు మూలం నవ్య శ్రీ రెడ్డి కొమరం సావిత్రి లు పూజా కార్యక్రమం నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన రిక్షా కాలనీ ప్రజలు గత అనేక దశాబ్దాలుగా లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్న విషయాన్ని ఈ కాలంలో అభివృద్ధి ప్రదాత నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారి దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే స్పందించి స్థానిక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ కృషి ఫలంగా ప్రజల శ్రేయస్సు కోసం విద్యుత్ శాఖ అధికారులకు నూతన ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న పాలకవర్గం కి ప్రజల నుండి సహాయ సహకారాలు అందించాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారి ఉపేందర్ మాట్లాడుతూ సారపాక తో పాటు మండల వ్యాప్తంగా లో వోల్టేజ్ తో బాధ పడుతున్న ప్రజలకు నూతన ట్రాన్స్ఫర్లు ఏర్పాటు చేయుటకై స్థల దాతలు ముందుకు వస్తే హై వోల్టేజీ ట్రాన్స్ఫర్లు తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తామని మండల ప్రజలకు తెలియజేశారు ఈ సదవకాశాన్ని అన్ని గ్రామాల పాలకవర్గాల వారు మరియు ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు తాము ఎల్లప్పుడూ ప్రజల శ్రేయస్ కోసమే నిరంతరాయంగా పనిచేస్తామని రాత్రి బవులు కష్టపడుతున్నాబమని తమ కష్టాన్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు నూతన ట్రాన్స్ఫర్లు ఏర్పాటు కోసం స్థలం దాతలు ముందుకు రావడం సంతోషకరమని వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దామరాజ నారాయణ మరియు కాంగ్రెస్ యువజన నాయకులు పోతిరెడ్డి అశోక్ రెడ్డి, శేసిరెడ్డి, భాగ్యమ్మ, స్వాతి ,అరుణ, రామకృష్ణ, వేణు, సురేష్, జ్యోతి , విద్యార్థి సంఘం నాయకుడు దామెర చావేజ్ (లక్కీ), శాంతి, విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు



## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి రూ.30 వేల ఆర్థిక సహాయం

చర్ల మహా : దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అపక శ్రీనిధి ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల చర్ల మండలంలో ఆనంద వాతావరణం నెలకొంది. ప్రతిభతో వైద్య విద్యలో అడుగు పెట్టిన శ్రీనిధిని ప్రోత్సహిస్తూ చర్ల మండలం సీఐ గారి చేతుల మీదుగా సీఐ మిత్రబృందం కలిసి రూ.30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు నాయకులు, గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో శ్రీనిధి మంచి వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అలాగే పేద, గిరిజన ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు రావాలని సూచించారు. విద్యార్థులకు సమాజం నుంచి ప్రోత్సాహం లభిస్తే మరింత ఉన్నత లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. శ్రీనిధి సాధించిన విజయంతో కొత్తపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నారాయణరావుపేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముర్రం వీరభద్రం, సోడి చలపతి, ఆదివాసీ సీనియర్ నాయకులు పాయం సత్యానారాయణ, కల్లూరి కోర్రాజు, కొర్స మరయ్య తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలో స్త్రీల కొరకు ప్రత్యేక వైద్య శిబిరాలు

**స్త్రీలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**
**స్త్రీలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**
**వరంగల్ జిల్లా డాక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో** : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చింతల్ లోని పుప్పలగుట్ట గర్భిణీ స్త్రీలకు మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వరంగల్ కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక వైద్య శిబిరాన్ని స్వయంగా పరిశీలించి ప్రజలకు ఈ క్రింది సూచనలు చేశారు. స్త్రీలు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని తగిన ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వ్యాధులు నిర్ధారణ అయితే దానికి సంబంధించిన చికిత్సలు తీసుకోవాలని కోరారు. స్త్రీలలో ఎక్కువగా రక్తహీనత ఉండటం వల్ల వివిధ రకాలైన వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఉన్నందున ప్రతి స్త్రీ తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లయితే ఆ కుటుంబం ఆరోగ్యంగాను ఆర్థికంగా సమృద్ధిగా ఉంటుందని తెలిపారు. ఇదే కాకుండా ప్రతి మంగళవారం జిల్లాలో ఆరోగ్య మహిళా క్లినిక్లు నిర్వహిస్తున్నారని ఆ కేంద్రాలకు వెళ్లి రక్తహీనత సంక్రమిత వ్యాధులు అసంక్రమిత వ్యాధులు ఒబిసిటీ గర్భ సంబంధిత వ్యాధులకు తగిన పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాల ప్రకారం చికిత్సలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్త్రీల కొరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ,డి డబ్ల్యు ఓ వరంగల్, వైద్యాధికారులు వైద్య ఆరోగ్యశాఖ , అంగన్వాడి సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



## వడదెబ్బతో మహిళ మృతి

**బూర్గంపహాడ్ మహా** : బూర్గంపహాడ్ మండలం టేకులచెరువు గ్రామానికి చెందిన దాసరి దుర్గమ్మ (56), భర్త లింగయ్య ఆదివారం మధ్యాహ్నం వడదెబ్బ కారణంగా మృతి చెందారు.గ్రామస్థుల వివరాల ప్రకారం, ఆదివారం మధ్యాహ్నం తీవ్ర ఎండ వేడిమిని తట్టుకోలేక ఆమె తీవ్రమైన డీహైడ్రేషన్‌కు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి మరింత దిగజారడంతో ఆసుపత్రిలోనే కన్నుమూశారు.దుర్గమ్మ మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది.



## వడదెబ్బ తగిలి మహిళ మృతి

**దమ్మపేట ,మే 25 మహా** : మండల పరిదిలోని చలమప్పగూడెం గ్రామానికి చెందిన బండారు నాగమణి (40) అనే మహిళ సోమవారం మృతి చెందింది. గత మూడు రోజుల క్రితం వారి పామాయిల్ తోట అగ్నికి పూర్తిగా దగ్ధం కావడంతో తన భర్తతో పాటుగా పామాయిల్ తోటకు వెళ్ళి నీటితడి పెట్టి ఇంటికి తిరిగి వచ్చారు. అప్పటినుండి కళ్ళు తిరగడం , వాంతులు ,విరేచనాలతో అస్వస్థతకు గురైంది. వెంటనే మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి తరలిస్తుండగా మార్గ మధ్యంలో నే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి భర్త కొర్రాజులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎసై. బి.రాజేష్ కుమార్ తెలిపారు.




## పంట వ్యర్థాలను కాల్చొద్దు

**నేలకొండపల్లి, మే 25 మహా**: పంట వ్యర్థాలను రైతులు కాల్చవద్దని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం, చెన్నారం గ్రామాలలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...వరి, మొక్కజొన్నకొయ్యలకు నిప్పు పెట్టటం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. పంటవ్యర్థాలను కాల్చటం ద్వారా భూసారం దెబ్బతినటంతో పాటు, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోకి దున్నుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ నిబంధనలు పాటించాలన సూచించారు. రైతులు పంట మార్పిడి లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రైతులకు 'అనుకూలంగా వానాకాలం ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాయితీ పై విత్తనాలు, ఆధునిక పరికరాలను అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరపురం సర్పంచ్ దండా రంగయ్య, ఉప సర్పంచ్ రాసాల నవీన్, ఏఈవో లు దుర్గాభవాని, ధాత్రి, రైతు ప్రతినిధులు కె. వీరస్వామి, జటంగి వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా డాలర్‌కు చావేనా? ఇరాన్ ఏం చేసిందంటే..

ప్రముఖ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' (Rich Dad Poor Dad) పుస్తక రచయిత, ఆర్థిక నిపుణుడు రాబర్ట్ కియోసాకి (Robert Kiyosaki) ప్రపంచ ఆర్థిక ముఖచిత్రంలో రాబోయే ఒక భారీ మార్పుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధం కంటే కూడా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి అమెరికా డాలర్‌కు పొంచి ఉందంటూ ఆయన హెచ్చరించారు. ఇరాన్ దేశం తన చమురు విక్రయాల కోసం అమెరికా డాలర్ స్థానంలో చైనా కరెన్సీ 'యువాన్' (Yuan)లో చెల్లింపులను స్వీకరించడం ప్రారంభించిందని, ఇది "పెట్రో డాలర్" (Petrodollar) వ్యవస్థ అంతానికి నాంది కానుందని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొన్నారు.

### 'పెట్రో డాలర్'కు మరణ శాసనం?

రాబర్ట్ కియోసాకి తన ట్వీట్‌లో ప్రపంచ ఆర్థిక చరిత్రలోనే ఇది అత్యంత కీలకమైన పరిణామమని అభివర్ణించారు."ఇరాన్ చమురు కోసం చైనా యువాన్‌ను అంగీకరించడం ప్రారంభించింది. దీని అర్థం ఏమిటి? మీ భవిష్యత్తుపై, అమెరికా డాలర్ భవిష్యత్తుపై దీని ప్రభావం ఎలా ఉండబోతోంది? ఇరాన్‌తో యుద్ధం కంటే ఇది అత్యంత ఘోరమైన పరిస్థితి. అమెరికా డాలర్ అంతం కాబోతోందా?" అని కియోసాకి ప్రశ్నించారు. ఈ అంతర్జాతీయ మార్పుల వల్ల సామాన్యులు నష్టపోకుండా ఉండేందుకు, ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి కనీసం ఒక గంట సమయాన్ని కేటాయించాలని ఆయన కోరారు. మన పాఠశాలల్లో ఇలాంటి ముఖ్యమైన విషయాలను ఎప్పటికీ నేర్పరని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ భారీ ఆర్థిక సంక్షోభం గురించి ప్రముఖ బిలియనీర్, ఇన్వెస్టర్ రే డాలియో (Ray Dalio) మాత్రమే స్పష్టంగా వివరిస్తున్నారని కియోసాకి పేర్కొన్నారు. రే డాలియో నిర్వహించిన "ఇరాన్ జస్ట్ కిల్డ్ ది పెట్రో డాలర్" అనే పాడ్‌కాస్ట్‌ను తప్పకుండా వినాలని కియోసాకి ప్రజలకు సూచించారు."మీ జీవితంలో మీరు పెట్టే అత్యుత్తమ పెట్టుబడి... మీ ఆర్థిక విద్యపై పెట్టే పెట్టుబడే" అని కియోసాకి ట్వీట్‌లో స్పష్టం చేశారు.

### అసలు ఏమిటీ పెట్రో డాలర్ సంక్షోభం?

గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా చమురు వ్యాపారం అంతా అమెరికా డాలర్లలోనే సాగుతోంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు తిరుగులేని ఆధిక్యత లభించింది. అయితే, ఇటీవల కాలంలో అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న ఇరాన్, రష్యా వంటి దేశాలతో పాటు చైనా కూడా డాలర్ రహిత వ్యాపారానికి (Dedollarization) తెరలేపాయి.



చమురు వ్యాపారంలో చైనా యువాన్ వాడకం పెరిగితే, అది అమెరికా డాలర్ పతనానికి దారితీస్తుందనే ఆందోళనలు ప్రపంచ ఆర్థిక వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఆ ఆందోళనలనే రాబర్ట్ కియోసాకి తాజాగా తన ట్వీట్ ద్వారా మరోసారి ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు.

# ఉద్యోగాలపై ఏఐ ప్రభావం..

## యువతకు పిచాయ్ సందేశం!

కృత్రిమ మేధస్సు (AI) గురించి ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా యువతలో.. విద్యార్థుల్లో ఏఐ తమ ఉద్యోగాలపై ప్రభావం చూపుతుందేమో అనే భయం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. ఇటీవల 'హార్డ్ ఫోర్క్' అనే పాడ్‌కాస్ట్‌లో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. యువతపై తనకు ఎంతో నమ్మకం ఉందని తెలిపారు. ఏఐ వల్ల మార్పులు వచ్చినా, కొత్త తరం ఆ సవాళ్లను స్వీకరించి మంచి భవిష్యత్తును నిర్మిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో జరగబోయే పట్టభద్రుల సభలో పిచాయ్ ప్రసంగించబోతున్నారు. ఈ సందర్భంగా.. పాడ్‌కాస్ట్ హోస్ట్ ఏఐ గురించి మాట్లాడితే.. విద్యార్థులు విమర్శిస్తే, ఏమని జవాబిస్తారు? అని సరదాగా ప్రశ్నించారు. 'ప్రతి తరం సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగింది. ఈ తరం కూడా అలాగే సవాళ్లను అధిగమించి మంచి ప్రపంచాన్ని నిర్మిస్తుంది' అని పిచాయ్ సమాధానం ఇచ్చారు. యువత, విద్యార్థులు ఏఐ ప్రభావాన్ని మాత్రమే అనుభవించరు. భవిష్యత్తులో ఏఐ అభివృద్ధిని ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా కూడా మారతారు. వీళ్ళే AI పురోగతికి కారణమవుతారు, దాని ప్రభావాలను కూడా ఎదుర్కొంటారని పిచాయ్ వెల్లడించారు. యువత కొత్త అవకాశాలను సృష్టించే శక్తి కలిగిన వారని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల చాలా కంపెనీలు.. ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం ఏఐ అని చెబుతున్నారు. దీనివల్ల ఉద్యోగాల భద్రతపై మరింత ఆందోళన పెరిగింది. ముఖ్యంగా కొత్తగా చదువు పూర్తి చేసిన యువతలో నిరుద్యోగం కూడా పెరుగుతోందని నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు AI గురించి భయపడటం సహజమని పిచాయ్ అంగీకరించారు. టెక్నాలజీలో వచ్చే మార్పులు ఎప్పుడూ సమాజంలో భయాన్ని కలిగిస్తాయి. గతంలో వచ్చిన సాధారణ సాంకేతిక మార్పులకు కూడా ప్రజలు భయపడ్డారు. కానీ.. తరువాత అవే అభివృద్ధికి దోహదపడ్డాయని ఆయన గుర్తుచేశారు. AIను కూడా సరైన విధంగా ఉపయోగిస్తే మానవ సమాజానికి ఉపయోగకరంగా మారుతుందని చెప్పారు.ఏఐ వల్ల జరిగే నష్టాలను మాత్రమే కాకుండా.. ప్రయోజనాలను కూడా ప్రజలకు స్పష్టంగా చూపించాల్సిన బాధ్యత టెక్నాలజీ రంగంపై ఉందని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. పరిశ్రమలు, కంపెనీలు, ప్రభుత్వాలు కలిసి బాధ్యతాయుతంగా AIని అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని పెంచేందుకు ఇంకా చాలా పని చేయాల్సి ఉందని ఆయన అంగీకరించారు.



# పెరుగుతున్న ధరలు.. నిర్మలా సీతారామన్ హెచ్చరిక!

అమెరికాఇరాన్ యుద్ధం.. ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తూ, దేశంలో ఖర్చులను పెంచుతున్నాయి. ఈ తరుణంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మూడు ఎఫ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. మూడు ఎఫ్‌లు ఫ్యూయల్ (ఇంధనం), ఫర్టిలైజర్ (ఎరువులు), ఫారెక్స్ (విదేశీ మారక నిల్వలు).



### పెరిగిన ధరలు - ప్రజలపై భారం!

ముంబైలో జరిగిన స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 37వ వార్షికోత్సవ కార్యక్రమంలో సీతారామన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎరువుల ధరలు ఊహకందని స్థాయికి చేరుకున్నాయి. కాగా ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా పెరుగుతుండటంతో ప్రజలపై భారం మరింత పెరుగుతోంది. కేవలం 11 రోజుల్లోనే పెట్రోల్ ధర లీటర్‌కు రూ.7.38 వరకు పెరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం.. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వద్ద ఏర్పడిన అంతరాయాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు సరఫరా దెబ్బతింటోంది. భారతదేశం తన చమురు అవసరాల్లో దాదాపు 85 90శాతం దిగుమతులపై ఆధారపడుతుంది. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే.. భారత్‌పై నేరుగా ప్రభావం పడుతుంది.

### మోదీ పిలుపు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ మారక నిల్వలను జాగ్రత్తగా ఉపయోగించాలని చెప్పారు. కాబట్టి, కొంతకాలం పాటు అవసరం లేని దిగుమతులను తగ్గించడం, విదేశీ ప్రయాణాలను వాయిదా వేయడం, కొంతకాలం బంగారం కొనుగోళ్లను తగ్గించడం వంటి సూచనలు ప్రజలకు, పరిశ్రమలకు ప్రధాని ఇచ్చారని సీతారామన్ గుర్తుచేశారు. ప్రస్తుతం భారతదేశంలో ఇంధన ధరల పెరుగుదల మాత్రమే సమస్య కాదు. ఎరువుల ధరలు భారీగా పెరగడం వల్ల వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతోంది. మరోవైపు బంగారం ధరలు పెరగడం కూడా దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెంచుతోందని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ అంశాలన్నీ భారత ఆర్థిక వ్యవస్థకు సవాళ్లను సృష్టిస్తున్నాయని ఆమె వివరించారు.

### అనేక సమస్యలు ఒకేసారి!

అమెరికాఇరాన్ యుద్ధ పరిస్థితుల ప్రభావం కేవలం రాజకీయ లేదా దౌత్య పరమైన అంశం కాదు, ఇది సాధారణ ప్రజల జీవితాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సీతారామన్ హెచ్చరించారు. ఇంధన ధరలు పెరగడం, సరుకు రవాణా ఆలస్యం కావడం, షిప్పింగ్ ఖర్చులు పెరగడం, పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకుల కొరత, ఎగుమతి ఆర్డర్లలో అనిశ్చితి వంటి అనేక సమస్యలు ఒకేసారి ఎదురవుతున్నాయని ఆమె చెప్పారు. పెరుగుతున్న ఇంధన ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆదాయ నష్టాన్ని భరించిందని సీతారామన్ చెప్పారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం వల్ల ప్రభుత్వానికి లక్ష కోట్ల రూపాయలకు పైగా ఆదాయ నష్టం వచ్చినప్పటికీ ప్రజలపై భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇదే సమయంలో.. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (MSMEs) చెల్లింపుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు 45 రోజుల్లోపు బకాయిలను చెల్లించాలని ఆమె సూచించారు.



## దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL



# ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి.. భారత్‌కు మాత్రం ఓ గుడ్‌న్యూస్

## భారత ఎగుమతులకు ఊపు.. ఆశాజనకంగా పర్ఫార్మెన్స్ .. ప్రపంచ మార్కెట్లలో విస్తరిస్తున్న మేక్ ఇన్ ఇండియా

భారత ఎగుమతుల పర్ఫార్మన్స్ 2026 ఏప్రిల్‌లో ఆశాజనకంగా కనిపించింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, వాణిజ్య అనిశ్చితులు నెలకొన్న సమయంలో కూడా భారత్ తన ఎగుమతి మార్కెట్లను విస్తరించడంలో ముందడుగు వేసినట్లు తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వం, పరిశ్రమల వర్గాలు కలిసి కొత్త మార్కెట్లను అన్వేషించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలితాలు ఇస్తున్నాయని ఈ గణాంకాలు చెబుతున్నాయి. వివిధ వాణిజ్య అవరోధాల మధ్య కూడా 2026 ఏప్రిల్‌లో భారత సరుకు ఎగుమతులు దాదాపు 14 శాతం పెరిగి 43.66 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ పెరుగుదలలో కొంత భాగం అంతర్జాతీయ ధరల పెరుగుదల వల్ల వచ్చినప్పటికీ, మరింత ముఖ్యమైన అంశం ఏమిటంటే.. భారత ఎగుమతిదారులు చేరుకుంటున్న మార్కెట్ల సంఖ్య గణనీయంగా పెరగడం.ప్రభుత్వ గణాంకాల ప్రకారం..గత ఏడాదిలో కనీసం 20 ఎగుమతి విభాగాలకు చెందిన ఉత్పత్తులు 17 లేదా అంతకంటే ఎక్కువ కొత్త దేశాలకు చేరాయి. ఉదాహరణకు, భారత హ్యాండ్లూమ్ ఉత్పత్తులు ఇప్పుడు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అదనంగా 29 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ కొత్త మార్కెట్లలో ఎగుమతుల పరిమాణం ఇప్పటికీ చిన్న స్థాయిలోనే ఉన్నప్పటికీ, కొత్త మార్గాలను తెరవడం ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఇంజినీరింగ్ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఆర్గానిక్ ఇనార్గానిక్ కెమికల్స్ వంటి భారత ప్రధాన ఎగుమతి రంగాలు గత ఏడాదితో పోలిస్తే 2026 ఏప్రిల్‌లో మెరుగైన వృద్ధిని నమోదు చేశాయి.

### మరో కోణంలోనూ మెరుగైన ప్రదర్శన

ఇది ప్రస్తుతం ఉన్న సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ సామర్థ్యాన్ని మాత్రమే కాదు, కొత్త సరఫరా గొలుసులు కూడా ఏర్పడుతున్నాయనే సంకేతాలను ఇస్తోంది. భారత ఎగుమతుల బలాన్ని అంచనా వేయడానికి మరో ప్రమాణం.. పెట్రోలియం ఉత్పత్తులు వాటి ధరల ప్రభావాన్ని పక్కనపెట్టి చూసే గణాంకాలు. ఈ కోణంలో కూడా భారత్ మెరుగైన ప్రదర్శనే చేసింది. 2026 ఏప్రిల్‌లో చమురుతేర ఎగుమతులు 9 శాతం పెరిగి దాదాపు 40 బిలియన్ డాలర్లకు చేరాయి. ముఖ్యంగా భారత సరుకు ఎగుమతుల వృద్ధి, దిగుమతుల వృద్ధిని మించి ఉండటం గమనార్హం. అయితే పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మార్చిలో వచ్చిన భారీ పడిపోయిన ధోరణి కొనసాగుతూ ఏప్రిల్‌లో పశ్చిమాసియాకు భారత ఎగుమతులు 28 శాతం తగ్గాయి. ఆ ప్రాంతం నుంచి దిగుమతులు కూడా సుమారు 32 శాతం పడిపోయాయి. ఇది భారత్‌కు అత్యంత కీలకమైన వాణిజ్య భాగస్వామ్య ప్రాంతం కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇతర ప్రాంతాల్లో వచ్చిన లాభాలు ఈ నష్టాలను పూర్తిగా భర్తీ చేయలేకపోతున్నాయి. ఇదే సమయంలో 'సేఫ్ అసెట్'గా భావించే బంగారం దిగుమతులు ఏప్రిల్‌లో 82 శాతం ఎగసిపడ్డాయి. భారతీయులు బంగారం కొనుగోళ్లు తగ్గించాలని ప్రధాని పిలుపునివ్వడం, ప్రభుత్వం దిగుమతి సుంకాలను పెంచడం వెనుక ఇదే కారణమై ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



### గ్లోబల్ ట్రేడ్ పవర్‌గా భారత్!

మరో ముఖ్యమైన అంశం సేవారంగ ప్రాధాన్యం పెరుగుతుండటం. 2014లో భారత మొత్తం ఎగుమతుల్లో సేవారంగం వాటా 39 శాతం మాత్రమే ఉండగా, ప్రస్తుతం అది దాదాపు 49 శాతానికి చేరుకుంది. అయితే, ఇక్కడే ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా కృత్రిమ మేధస్సు (AI) వేగంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఐటీ సేవల రంగంలో భారత పోటీ సామర్థ్యం తగ్గితే అది పెద్ద దెబ్బ కావచ్చని సూచిస్తున్నారు. అయినప్పటికీ, వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఎగుమతి గమ్యస్థానాలను విస్తరించడం వంటి ప్రభుత్వ చర్యలు ఫలిస్తున్నాయని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఇకపై వ్యయం, నాణ్యత, ఉత్పత్తి పరిమాణం పరంగా భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని మరింత పెంచగలిగితే.. భారత్ నిజమైన గ్లోబల్ ట్రేడ్ పవర్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

# రూ. 90 లక్షలు పోగొట్టుకున్న రిటైర్డ్ నర్సు



నాగ్‌పూర్‌కు చెందిన ఒక 72 ఏళ్ల పదవీ విరమణ పొందిన (రిటైర్డ్) నర్సును సైబర్ నేరగాళ్లు నిండా ముంచేశారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో కొన్ని వారాల పాటు భయ భ్రాంతులకు గురిచేసి, రూ. 90.65 లక్షలు దోచుకున్నారు.జిల్లాలోని జరిపట్కా నివాసి అయిన మహిళకు, గతేడాది నవంబర్‌లో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ అధికారినంటూ ఓ వ్యక్తి కాల్ చేశారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ అధికారులమంటూ ఆమెను నమ్మించారు. మనీలాండరింగ్ కేసులో ఆమె పేరు బయటపడిందని, ఏ క్షణమైనా అరెస్టు చేసే అవకాశం ఉందని బదిరించారు.అంతేకాదు వీడియో కాల్స్ చేసిన అచ్చం పోలీస్ట్ స్టేషన్‌లా, నకిలీ పోలీస్ స్టేషన్, నకిలీ కోర్టు విచారణలను సృష్టించి బాధితురాల్ని మరింత భయపెట్టారు. మిమ్మల్ని 'డిజిటల్ అరెస్ట్' చేస్తున్నామని, ఎవరికీ చెప్పకూడదని బందీగా ఉంచారు. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 9 మధ్య వివిధ ఖాతాలకు రూ.90.65 లక్షలు బదిలీ చేయించారు. తమ విచారణలో ఆమె నిర్దోషిగా తేలితే డబ్బు వాపసు ఇస్తామని చెప్పిన దుండగులు.. తరువాత అన్ని రకాల కమ్యూనికేషన్స్ కట్ చేశారు. వారి ఫోన్లు స్విచ్చాఫ్ అవ్వడంతో తా తాను మోసపోయానని గ్రహించిన ఆమె ఇటీవల పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలు, పోలీసులు, కోర్టులు, ఏజెన్సీలు 'డిజిటల్ అరెస్టులు'నిర్వహించవని, డబ్బు బదిలీ చేయమని అడగవని తెలిపారు. ఇలాంటి డిజిటల్ అరెస్ట్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ వివరాలు, డబ్బులు ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు.

# ఆయిల్ కంపెనీలో అగ్నిప్రమాదం

## వరసగా బ్యారెళ్లన్నీ పేలిపోతూ..



**చెన్నై:** నగరంలోని మనలీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆయిల్ పరిశ్రమలో మంటలు చెలరేగి, భారీగా ఎగిసిపడుతున్నాయి. ఎనిమిది ఫైరింజన్లు మంటలను అదుపుచేస్తున్నాయి. విచ్చూర్ లక్ష్మీ నగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆయిల్ గోదాం నుంచి భారీగా నల్లపొగ ఎగసిపడిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. మంటల తీవ్రత అధికంగా ఉండడంతో ఆర్పడం కష్టతరమైంది. మనలి పుదు నగర్, విచ్చూర్ రెండు ప్రాంతాల మధ్యలోనే శ్రీ సత్యసాయి లూబ్రికేషన్స్ అనే ఆయిల్ నిల్వ చేసే పరిశ్రమ ఉంది. అందులో ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం జరిగింది. 50కి మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చి మంటలను ఆర్పే పనిలో పాల్గొంటున్నారని అధికారులు తెలిపారు. ఈ పరిశ్రమ పదేళ్లకు పైగా నడుస్తోందని చెబుతున్నారు. ముఖ్యంగా పాత ఆయిల్‌ను బారెళ్లలో నిల్వ చేసే గోదాముగా ఈ పరిశ్రమ పనిచేస్తోందని తెలిసింది. ముందుగా చిన్నస్థాయి అగ్నిప్రమాదం జరిగి, ఆ తర్వాత పరిశ్రమలో ఉన్న ఆయిల్ బారెళ్లు పేలి చెల్లాచెదురవడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. సుమారు 2000కు పైగా బ్యారెళ్లు అక్కడ నిల్వ ఉన్నాయి. అవి పేలిపోవడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నల్లపొగ ఆ ప్రాంతమంతా కమ్మేసి భయాందోళన కలిగిస్తోంది.అంతా ఆయిల్ ఉండటంతో ఒకదాని తర్వాత ఒక బారెల్ పేలుతుండటంతో అగ్నిమాపక సిబ్బంది కూడా దగ్గరకు వెళ్లి మంటలు ఆర్పలేని పరిస్థితి ఎదురైంది. ఆ బారెళ్లు పూర్తిగా పేలి మంటలు తగ్గిన తర్వాతే పూర్తిగా అదుపులోకి తేవచ్చని చెబుతున్నారు. అంతవరకు దగ్గర్లో ఉన్న ఇతర భవనాలకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక శాఖ చర్యలు చేపడుతోంది. మంటలను పూర్తిగా ఆర్పే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

# రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు హాజరయ్యారు. మరణానంతరం ప్రముఖ హిందీ నటుడు ధర్మేంద్రకి పద్మ విభూషణ్ పురస్కారం అందింది. ఆయన సతీమణి హేమామాలిని అవార్డును అందుకున్నారు. ఆ సమయంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మొత్తం 131 పద్మ అవార్డులకు ఆమోదం తెలిపింది. ఇందులో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి.అధికారిక వివరాల ప్రకారం తొలి విడతలో 66 మందికి అవార్డులు అందజేస్తున్నారు. ఈరోజు జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2 పద్మ విభూషణ్, 6 పద్మ భూషణ్, 58 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. మిగిలిన పద్మ అవార్డు గ్రహీతలకు ఈ ఏడాది తర్వాత నిర్వహించే రెండో విడత పురస్కార ప్రదాన కార్యక్రమంలో అందిస్తారు. ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులను ప్రకటిస్తారు. ఇవి దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటి. కళలు, సామాజిక సేవ, సాహిత్యం, వైద్యం, విజ్ఞానం, ఇంజినీరింగ్, క్రీడలు, ప్రజా వ్యవహారాలు, వాణిజ్యం, పరిశ్రమలు, సివిల్ సేవలు వంటి రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఈ అవార్డులు ఇస్తారు.పద్మ విభూషణ్ అత్యున్నత స్థాయి విశిష్ట సేవలకు ఇస్తారు. పద్మ భూషణ్ ఉన్నత స్థాయి విశిష్ట సేవలకు ప్రదానం చేస్తారు. ఏ రంగంలోనైనా విశేష సేవలు అందించిన వారికి పద్మశ్రీ పురస్కారం అందజేస్తారు.

### తెలుగు రాష్ట్రాల వారు వీళ్లే ...

రాష్ట్రపతి చేతుల మీదుగా సోమవారం పద్మ అవార్డులు అందుకున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు మామిడాల జగదీశ్, దీపికా రెడ్డి, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, డాక్టర్ గూడూరు వెంకటరావు, వెంపటి కుటుంబ శాస్త్రి, పాలకొండ విజయ్ ఆనంద రెడ్డి. ఎన్. రాజంకు పద్మ విభూషణ్ పురస్కారం ప్రదానం చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలిగా ఆమె గుర్తింపు పొందారు.పుదుచ్చేరికి చెందిన సిలంబం కళాకారుడు కె. పజనివేల్‌కు సంప్రదాయ యుద్ధ కళల రంగంలో చేసిన సేవలకు పద్మశ్రీ పురస్కారం అందించారు.పారా హైజంప్‌లో పారాలింపిక్ స్వర్ణ పతక విజేత ప్రవీణ్ కుమార్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. ప్రకటనల రంగ ప్రముఖుడు దివంగత పీయూష్ పాండేకు పద్మ భూషణ్ పురస్కారం ప్రకటించారు. ఈ అవార్డును ఆయన భార్య నీతా జోషి స్వీకరించారు.భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు క్రీడల రంగంలో చేసిన సేవలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మశ్రీ పురస్కారం అందించారు. వీరితో పాటు మొత్తం 66 మంది సోమవారం పద్మ అవార్డులు అందుకున్నారు.

# హీరోకు తల్లిగా కనిపించిన హీరోయిన్.. కారణమేంటంటే?



**హీరోలకు ఎంత వయసొచ్చినా హీరో పాత్రలు చేస్తూనే ఉంటారు. కానీ, హీరోయిన్ల పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. ఒక వయసొచ్చాక లేదా పెళ్లయ్యాక వారికి వచ్చే ఆఫర్లు, పాత్రలు కాస్త భిన్నంగానే ఉంటాయి. అలా ఒకప్పటి హీరోయిన్ భాగ్యశ్రీ తాజాగా మరాఠీ చిత్రంలో తనకంటే కాస్త చిన్నవాడైన హీరోకి తల్లిగా నటించింది.**

**హీరోకు తల్లిగా..**

రితేశ్ దేశ్ ముఖ్.. మరాఠా కింగ్ శివాజీగా నటించిన తాజా చిత్రం 'రాజా శివాజీ'. ఇందులో శివాజీ తల్లి జీజాబాయిగా భాగ్యశ్రీ యాక్ట్ చేసింది. ఈ సినిమా రూ.100 కోట్లపైనే కలెక్షన్స్ రాబట్టింది. అయితే వయసులో తనకంటే కేవలం 10 ఏళ్ల చిన్నవాడైన హీరోకు తల్లిగా నటించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీని గురించి భాగ్యశ్రీ స్పందిస్తూ.. 'శివాజీ వంటి మహాయోధుల కథలను చిన్నప్పటి నుంచి వింటూ పెరిగాం.

**ఆ ప్రశంస మర్చిపోలేను**

అలాంటి సినిమాలో నటించే ఛాన్స్ వస్తే తిరస్కరించ గలమా? పైగా జీజాబాయి కూడా యంగ్ మదరే! ఈ మూవీ సినిమాటోగ్రాఫర్ సంతోశ్ శివన్ సర్ నన్ను పిలిచి.. సారీ, మీరు చాలా యంగ్‌గా కనిపిస్తున్నారు. అందుకని నా కెమెరాతో మిమ్మల్ని కాస్త వయసుపై బడినదానిలా చూపిస్తాను అన్నారు. ఆ ప్రశంస నా మనసును తాకింది' అని చెప్పుకొచ్చింది.

**సినిమా**

రాజా శివాజీ సినిమా విషయానికి వస్తే.. రితేశ్ దేశ్‌ముఖ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆయన భార్య జెనీలియాతో పాటు నిర్మాత జ్యోతి దేశ్‌పాండే నిర్మించారు. ఈ మూవీలో సంజయ్‌దత్, అభిషేక్ బచ్చన్, మహేశ్ మంజ్రేకర్, సచిన్ ఖేడ్కర్, ఫర్దీన్ ఖాన్, జెనీలియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. భాగ్యశ్రీ విషయానికి వస్తే.. 1989లో మైనే ప్యార్ కియా సినిమాతో వెండితెరపై కథానాయికగా ఎంట్రీ ఇచ్చింది. హిందీలో అనేక సినిమాలు చేసింది.



# పెద్ది ఐటమ్ సాంగ్..
## రిలీజైన కొన్ని గంటల్లోనే రికార్డ్..!

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న ఈ మూవీ.. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌ను కూడా విడుదల చేశారు. హల్లల్లలో అంటూ సాగే ఈ సాంగ్‌లో రామ్ చరణ్ స్టెప్పులతో అదరగొట్టేశారు. ఈ ప్రత్యేక పాటలో కోలీవుడ్ భామ శృతిహాసన్ తన డ్యాన్స్‌తో ఫ్యాన్స్‌ను అలరించింది. తాజాగా ఈ సాంగ్ రికార్డ్ క్రియేట్ చేసింది. యూట్యూబ్‌లో విడుదలైన కొన్ని గంటల్లోనే ఊహించని రెస్పాన్స్ సొంతం చేసుకుంది. ఇప్పటిదాకా 50 మిలియన్లకు (5 కోట్లకు) పైగా వ్యూస్‌తో దూసుకెళ్తోంది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. కాగా.. ఈ చిత్రంలో చెర్రీ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా మెప్పించనుంది. మరోవైపు ప్రస్తుతం ఈ మూవీ డబ్బింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

## పెళ్లి కంటే ఆ పని చేయడం
# చాలా బెటర్



స్వాతి అంటే గుర్తు పట్టరేమో కానీ.. కలర్స్ యాడ్ చేస్తే ఇట్టే పసిగడతారు. అంతలా ఆ పేరుతోనే తెలుగు ప్రేక్షకుల గుండెల్లో పేరు సంపాదించుకుంది. డేంజర్ సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన తెలుగమ్మాయి.. ఆడవారికి మాటలకు అర్థాలే వేరులే సినిమాతో ఫుల్ ఫేమ్ తెచ్చుకుంది. ఆ తర్వాత అష్టా చెమ్మా, త్రిపుర, కలవరమాయే మదిలో, మిరపకాయ్ చిత్రాల్లో నటించింది. కొన్నేళ్ల తర్వాత మంత్ ఆఫ్ మధు చిత్రం ద్వారా ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం సినిమాలేవీ చేయకపోయినా ఈ ముద్దుగుమ్మ.. తాజా ఇంటర్వ్యూలో పెళ్లి, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడింది. ముఖ్యంగా పెళ్లి టాపిక్‌పై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పెళ్లి చేసుకోవడం కన్నా ఓ కుక్కను పెంచుకోవడం చాలా బెటర్ అని తన మనసులోని మాటను బయటకు చెప్పేశారు. ఈ రోజుల్లో ఒక మనిషిని నమ్మి, వివాహం చేసుకుని జీవితాంతం కలిసి ఉండటం చాలా కష్టంగా మారిపోయిందని తెలిపింది. ఈ రోజుల్లో ఎవరికీ కూడా కొంచే కూడా ఓపిక ఉండడం లేదని.. అందుకే ముక్కు, మొహం తెలియని వ్యక్తిని పెళ్లాడి ప్రతిరోజూ మానసిక ప్రశాంతతను కోల్పోవడం నాకు ఇష్టం లేదన్నారు. అందుకే ఎలా చింతా లేకుండా హాయిగా ఒక కుక్కను పెంచుకోవడం చాలా బెటర్ అని అన్నారు. ఎందుకంటే అది మనకు ఎప్పుడూ నమ్మకంగా ఉంటుందని.. ఎలాంటి కండిషన్లు లేకుండా మనల్ని ప్రేమిస్తుందని హీరోయిన్ స్వాతిరెడ్డి చెప్పుకొచ్చింది.

# ఇది గమనించారా? ఆ స్టార్ హీరోల బ్లాక్‌బస్టర్ సక్సెస్ వెనక త్రిష

**హీరోయిన్ త్రిషకు 43 ఏళ్ల వయసొచ్చినా అందం, చురుకుదనం ఏమాత్రం తగ్గలేదు. కొత్త హీరోయిన్లకు గట్టి పోటీనిస్తూ పెద్ద సినిమాల్లో అవకాశాలు అందుకుంటోంది. తాజాగా కరుప్పతో బ్లాక్‌బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. అయితే కొంతకాలంగా త్రిష పేరు అటు రాజకీయాల్లో, ఇటు ఫిల్మీదునియాలో మారుమోగిపోతోంది. హీరో విజయ్-త్రిష ప్రేమలో ఉన్నారని కొన్నేళ్లుగా ప్రచారం జరుగుతోంది.**



**లక్కీ చార్మ్**

ఇటీవల విజయ్ భార్యతో విడాకులకు సిద్ధపడటం.. సీఎంగా గెలిచాక త్రిషతో చెట్టాపట్టాలేసుకుని తిరగడంతో ఈ ప్రేమాయణం నిజమని అందరికీ అర్థమైపోయింది. పైగా తను కూడా రాజకీయాల్లో అడుగుపెడుతుందని మరో కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. ఈ విషయాన్ని కాసేపు పక్కన పెడితే తమిళ స్టార్ హీరోలకు త్రిష బాగా అచ్చొచ్చిందట. అందుకు కారణం.. విజయ్, అజిత్, సూర్యల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో తనే హీరోయిన్. ఈ ఆసక్తికర విషయాన్ని ఓ అభిమాని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దాన్ని త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తిరిగి పంచుకుంది.

**విజయ్:**

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం 'లియో'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో త్రిష కథానాయిక. 2023లో దసరాకి ముందు విడుదలైన ఈ చిత్రం ఏకంగా రూ.600 కోట్లకు పైగా రాబట్టి విజయ్ కెరీర్‌లో హయ్యస్ట్ కలెక్షన్స్ రాబట్టిన సినిమాగా రికార్డుకెక్కింది.

**అజిత్:**

హీరో అజిత్ 'గుడ్‌బ్యాడ్ అగ్లీ' ద్వారా తన కెరీర్‌లోనే హయ్యస్ట్ కలెక్షన్స్ అందుకున్నాడు. 2025లో విడుదలైన ఈ సినిమాలోనూ త్రిషయే కథానాయిక. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ మూవీ దాదాపు రూ.250 కోట్లు వసూలు చేసింది.

**సూర్య:**

కొంతకాలంగా ఫ్లాపులతో సతమతమవుతున్న సూర్య ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ కొట్టాడు. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో సూర్య ప్రధాన పాత్రలో నటించిన 'కరుప్పు'. ఈ ఏడాది మే 15న విడుదలైన ఈ చిత్రం ఇప్పటివరకు సుమారు రూ.250 కోట్ల మేర కలెక్షన్స్ సాధించింది. ఇప్పటికీ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఇందులోనూ త్రిషయే కథానాయిక. అలా త్రిష నటించిన పై మూడు సినిమాలు భారీ కలెక్షన్ల రికార్డులతో ఆయా హీరోల కెరీర్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. దీంతో ఆమెను లక్కీ ఛార్మ్ అని కొనియాడుతున్నారు.




# సాలిడ్ సక్సెస్ కోసం
# అనన్య ఎదురుచూపులు..

అనన్య నాగళ్ళ.. ఈ తెలుగుఅమ్మాయి హీరోయిన్ గా నిలదొక్కుకోవడానికి చాలా ప్రయత్నిస్తుంది. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన మల్లేశం సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆతర్వాత ఒకటి రెండు సినిమాలు చేసిన సక్సెస్ కాలేకపోయింది. ఆతర్వాత పవర్ స్టార్ పవన్‌కళ్యాణ్ హీరోగా నటించిన వకీల్ సాబ్ సినిమాలో ముఖ్య పాత్రలో నటించింది. ఈ సినిమాతో అనన్య క్రేజ్ పెరిగింది. ఆతర్వాత ఈ అమ్మడికి వరుసగా అవకాశాలు క్యూ కట్టాయి. దాంతో బిజీగా మారిపోయింది. వకీల్ సాబ్ సినిమా తర్వాత మాస్ట్రో, ఊర్వశివో రాక్షశివో, శాకుంతలం, మళ్ళీ పెళ్ళి సినిమాల్లో నటించింది. కానీ అవేమి సక్సెస్ కాలేదు. అలాగే హీరోయిన్ గా అన్వేషి, తంత్ర, పొట్టేలు సినిమాలు చేసింది అవి కూడా అంతగా ఆకట్టుకోలేదు. కానీ అనన్య వరుస సినిమాలతో దూసుకుపోతుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో ఈ అమ్మడు యమా యాక్టివ్ గా ఉంటుంది. ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా అనన్య షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. కుర్రాళ్ళు ఈ భామ ఫోటోలకు కొంటె కామెంట్స్ చేస్తున్నారు.

# నమ్మశక్యం కాని వసూళ్లు..
## ఈ సినిమాలో అంతలా ఏముంది?



'కళామతల్లికి సేవ చేస్తున్నాం' లాంటి మాటలు ఎవరెన్ని చెప్పినా సినిమా అనేది ప్యూర్ వ్యాపారం. ఏ నిర్మాత అయినా పెట్టుబడి ఎంత? లాభం ఎంత? లాంటి విషయాలే అంతిమంగా ఆలోచిస్తాడు. కొందరు నిర్మాతలకు అప్పుడప్పుడు అలాంటి అదృష్టం దక్కుతుంది. ఇప్పుడు హాలీవుడ్ నిర్మాణ సంస్థకు అలాంటి జాక్‌పాట్ తగిలింది. అది కూడా ఓ హారర్ సినిమాతో. ఇంతకీ దీని సంగతేంటి? వసూళ్లు ఎలా ఉన్నాయి? ఈ నెల 15న అమెరికాతో పాటు మరికొన్ని దేశాల్లో 'అబ్సెషన్' అనే సైకో హారర్ మూవీ థియేటర్లలోకి వచ్చింది. దీనికి రూ.7 నుంచి రూ.10 కోట్ల బడ్జెట్ అయింది. కానీ బాక్సాఫీస్ దగ్గర ఇది సృష్టిస్తున్న సెన్సేషన్ చూస్తే అమ్మ బాబోయ్ అనాల్సిందే. ఎందుకంటే తొలివారం 16 మిలియన్ డాలర్లు, రెండోవారం 22 మిలియన్ డాలర్లు కలెక్షన్స్ సాధించింది. ఇప్పటివరకు అమెరికాలో దగ్గర దగ్గర 60 మిలియన్ డాలర్లు వసూలు చేయగా.. ప్రపంచ వ్యాప్తంగా 75 మిలియన్ డాలర్ల మార్క్ దాటేసింది. మరో వారం పదిరోజుల్లో 100 మిలియన్ డాలర్ల గీత దాటేయడం గ్యారంటీ. ఇదే గనక నిజమైతే పెట్టిన పెట్టుబడి 100 రెట్ల లాభం సంపాదించినట్లే.

మరి ఇంతలా ఈ సినిమాలో ఏముందా అని చూస్తే.. బేర్ అనే కుర్రాడు నిక్కీ అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆమెని ఎలాగైనా సొంతం చేసుకోవాలనుకుంటాడు. కానీ ప్రేమని బయటకు చెప్పడు. ఓసారి చిత్రమైన బొమ్మ ఎదుట నిలబడి నిక్కీ వేరే ఎవరిని ప్రేమించనంత గొప్పగా తనని ఇష్టపడాలని కోరుకుంటాడు. కట్ చేస్తే నిక్కీ లాంటి అమ్మాయి ఇతడి జీవితంలోకి వస్తుంది. ఆమె ఓ సైకో. చిత్రంగా ప్రవర్తిస్తూ ఘోరమైన హత్యలు చేయడం మొదలుపెడతుంది. చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ. హద్దులు మీరి అతిగా ప్రేమిస్తే ఏమవుతుందనేది ఈ మూవీ ద్వారా దర్శకుడు చూపించే ప్రయత్నం చేశాడు. కొన్ని సీన్స్ చూడాలంటే మీకు కచ్చితంగా గుండె ధైర్యం కావాలి. మన దేశంలో ఈ వీకెండ్ రిలీజ్ కానుంది.

# అందంలో అప్సరస..



ప్రేమమ్ సినిమాతో సినీరంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుపమ.. 2015లో స్టార్ స్టేటస్ అందుకుంది. తెలుగు, తమిళం, మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుని ఈ బ్యూటీ రోజు రోజుకు మరింత పాపులర్ అయ్యింది. కానీ అనుపమకు అనుకున్నంతగా సరైన బ్రేక్ మాత్రం రాలేదు. ఇప్పటివరకు అనేక హిట్ చిత్రాల్లో నటించిన అనుపమకు.. స్టార్ హీరోల సినిమాల్లో మాత్రం ఛాన్స్ రాలేదు .2015లో 'ప్రేమమ్' సినిమాతో ఆమె సినీరంగుల జీవితాన్ని ప్రారంభించింది. ఈ మూవీ భారీ విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత తెలుగులో శతమానం భవతి సినిమాతో కథానాయికగా పరిచయమైంది. తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం భాషలలో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలలో ఒకరిగా మారింది. అనుపమ పరమేశ్వరన్ కేవలం 19 సంవత్సరాల వయసులోనే హీరోయిన్ అయ్యింది. మలయాళ 'ప్రేమమ్' ఆమె జీవితాన్ని మార్చేసింది. ఈ సినిమాలో కనిపించింది కాసేపు మాత్రమే అయినప్పటికీ అందరి దృష్టిని ఆకర్షించింది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com